

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంత దారిద్ర్యం..!

● రామ్‌నగర్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతంలో రోడ్డు వేసేందుకు రూ.80 లక్షల ఎస్ క్యాప్ నిధులతో రెండుసార్లు టెండరు పిలిచారు. ఎవరూ క్వాలిఫై కాకపోవడంతో రద్దు చేశారు. మూడోసారి కూడా టెండర్ పిలిచారు. ఆ రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. సాయినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి అంబేడ్కర్ భవన్ ఎదుట మట్టిరోడ్డులా తయారైంది. ఇలాంటివి నగరంలో చాలానే ఉన్నాయి.



రామ్‌నగర్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయ రోడ్డు



జీసస్ నగర్‌లో...

- అటకెక్కిన అభివృద్ధి పనులు
- మట్టిరోడ్లుగా మారిన సీసీ రోడ్లు
- నెలల తరబడి బిల్లులు పెండింగ్
- ఆగిపోయిన రూ.25 కోట్ల పనులు
- ప్రభుత్వ ఉత్తర్వులతో మరో రూ.20 కోట్ల పనుల రద్దు

అనంతపురం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరం అధ్వానంగా ఉంది. దారులన్నీ దెబ్బతిన్నాయి. సీసీ రోడ్లు మట్టి రోడ్లుగా మారిపోయాయి. ఇదంతా గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలన ప్రభావమని చెప్పాల్సిన పనిలేదు. వీటిని బాగు చేసేందుకు టెండర్లు పిలిచినా.. బిల్లులు చెల్లించరనే భయం కాంట్రాక్టర్లను వెంటాడింది. ఒకప్పుడు పనులను దక్కించుకునేందుకు పోటీపడిన కాంట్రాక్టర్లు.. వైసీపీ దెబ్బకు పిలిచినా పలకడం మానేశారు. దీంతో అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. ఫైళ్లు పెండింగ్‌లో ఉండటం, బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. తాజాగా 25 శాతం లోపు జరిగిన పనులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇదివరకు కమిషనర్ లాగిన్‌లో వందల సంఖ్యలో ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త కమిషనర్ వాటిని పరిశీలించేందుకు సమయం పడుతుంది. దీంతో పనులు ఎప్పుడు మొదలౌతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. సమస్యలను దాటుకుని.. నగరంలో అభివృద్ధి పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

పెండింగ్ ఫైళ్లు 400

నగరపాలిక పరిధిలో వివిధ పనులు, పలు విభాగాల ఫైళ్లు కలిపి మొత్తం 400వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇందులో ఇంజనీరింగ్ విభాగం పనుల ఫైళ్లే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో పనిచేసిన ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఫైళ్లు పెండింగ్ ఉండిపోయినట్లు తెలుస్తోంది. బిల్లు పెట్టి సీఎఫ్ఎంఎస్‌లో ఉన్న ఫైళ్లు 70 వరకు, శాంక్షన్ అయి ముందుకు కదలాల్సిన ఫైళ్లు 50కిపైగా, బిల్లులు పడాల్సిన ఫైళ్లు 120 నుంచి నుంచి 140 వరకు పెండింగ్‌లో ఉన్నట్లు ఇంజనీరింగ్, కాంట్రాక్టు వర్గాలు చెబుతున్నాయి. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర విభాగాలకు సంబంధించి ప్రధాన ఫైళ్లు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా వచ్చిన కమిషనర్‌పై ఫైళ్ల ఒత్తిడి ఉంది. ఆయన బాధ్యతలు చేపట్టి 40 రోజులైంది. విభాగాల వారీగా సమీక్షించడం, అంశాలపై అవగాహన, సమస్యలపై దృష్టి సారించడంతోపాటు పెండింగ్ ఫైళ్లపైనున్న దుమ్ము దులపాల్సి ఉంది. ఫైళ్ల పెండింగ్‌పై కాంట్రాక్టు వర్గాలు మండిపడుతున్నాయి. నెలల తరబడి అలాగే ఉండటంపైనా విమర్శలు వస్తున్నాయి.

పనులు రద్దు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కొన్ని పనులు రద్దు చేయాలని ఆదేశాలిచ్చింది. 25 శాతం లోపు మాత్రమే పూర్తయినవి, ప్రారంభం కానివి ఈ జాబితాలో ఉన్నాయి. జనరల్ ఫండ్‌కు సంబంధించి నగరపాలిక పరిధిలో ప్రారంభం కానివి రూ.17 కోట్ల పనులు ఉన్నాయి. 25శాతం లోపే పూర్తయినవి రూ.2 కోట్ల పనులు ఉన్నాయి. ఇవన్నీ రద్దు కావచ్చని తెలుస్తోంది. 15వ ఆర్థికం సంఘం నిధుల పనులు రూ.కోటిపైగా రద్దు కావచ్చని అంటున్నారు. ఇలా రద్దయ్యే పనుల విలువ రూ.20 కోట్లకు పైగా ఉంటుందని ఇంనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

కాగా తన వద్ద ఫైల్స్ పెండింగ్ ఏమీ లేవని కమిషనర్ నాగరాజు అన్నారు.

బిల్లుల భయం

● నగరంలో జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులతో తరచూ పనులు జరుగుతుంటాయి. ఎక్కువగా సీసీ రోడ్లు, కాలువలు, పార్కుల్లో అభివృద్ధి పనులు చేపడుతుంటారు. ఇలాంటి పనులకు టెండర్లు పిలుస్తారు. వాటిని దక్కించుకున్న కాంట్రాక్టర్లు.. ఒప్పందం చేసుకుని పనులు మొదలు పెడతారు. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు సకాలంలో అందక కాంట్రాక్టర్లు అల్లాడిపోయారు. దీని ప్రభావంతో చాలా టెండర్లను పదే పదే పిలవాల్సి వచ్చింది.

● ప్రత్యేక నిధులు రూ.25 కోట్లతో ఏడాదిన్నర క్రితం 19 పనులకు టెండరు పిలిచారు. ఒకే సంస్థ వాటిలో 90 శాతం పనులు దక్కించుకుంది. అందులో కేవలం మూడు పనులే పూర్తయ్యాయి. వాటికి కూడా బిల్లులు సరిగా రాలేదు. దీంతో ఆ కాంట్రాక్టు సంస్థ మిగిలిన పనులను పూర్తి చేసే ధైర్యం చేయలేకపోయింది. దీంతో రూ.21 కోట్ల పనులు బ్రేక్ పడినట్లు సమాచారం.

● షిర్డీ నగర్‌లో రూ.75 లక్షలతో సీసీ రోడ్డు, భాగ్యనగర్, బిందెలకాలనీ పరిధిలో రూ.1.91 కోట్లతో సీసీ రోడ్డు, వేణుగోపాల్‌నగర్ పరిధిలో రూ.1.60 కోట్లతో సీసీ రోడ్డు, సూర్యానగర్ పరిధిలో రూ.1.45 కోట్లతో, ఐదో రోడ్డు, ఆరో రోడ్డు పరిధిలో రూ.1.69 కోట్లతో సీసీ రోడ్డు, సోమనాథ్‌నగర్‌లో రూ.1.87 కోట్లతో నడిమివంక మేజర్ బ్రిడ్జి, రూ.1.26 కోట్లతో శాంతినగర్‌లో రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్ పడింది. ఇంకా మిగిలిన రూ.2 కోట్లకు పైగా పనులకు టెండరు పిలిచినా.. బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్లు వెనకడుగేశారు. ఇలా మొత్తం రూ.25 కోట్లకు పైగా పనులపై బిల్లుల ప్రభావం పడింది.

ర్యాగింగ్ వద్దు

కలెక్టరు వినోద్‌కుమార్..

ఘనంగా మెడికోల ఫ్రెషర్స్ డే





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న మెడికోలు

అనంతపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 'ర్యాగింగ్‌తో జీవితాలు నాశనమవుతాయని కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అనంత వైద్యకళాశాలలో వైద్యవిద్యార్థుల ఫ్రెషర్స్‌డేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యవృత్తికి సమాజంలో ప్రత్యేక గౌరవం ఉందన్నారు. కళాశాలలో సీనియర్స్ జూనియర్స్ అనేభావన లేకుండా సోదరభావంతో ఉండాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో ప్రతిభ చూపిన మెడికోలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, జిల్లాఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ హేమలత, ప్రొఫెసర్లు నవీన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, మధు, షంషాద్‌బేగం, షారోన్‌సోనియా, చలపతి, పరదేశీనాయుడుతోపాటు పలువురు డాక్టర్లు, కళాశాల మెడికోలు పాల్గొన్నారు.

సాగునీటి కేటాయింపులను పునఃసమీక్షించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి కేటాయింపులపై పునఃసమీక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో హంద్రీనీవాకు గతం కంటే నిధులు పెంచడాన్ని సీపీఎం స్వాగతిస్తోందన్నారు. పెంచిన నిధులను నిర్దిష్ట కాలపరిమితిలోపు ఖర్చుచేసి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. జిల్లా సాగునీటి వనరుల అభివృద్ధికి ఏడువేల కోట్లు అవసరం కాగా వెయ్యి కోట్ల లోపు మాత్రమే కేటాయించారన్నారు. జిల్లాకు జీవనాడిగా ఉన్న హెచ్చెల్సీ స్టేజ్-1, స్టేజ్-2 పనుల కోసం రూ.792కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించగా రూ.282కోట్లు మాత్రమే కేటాయించడంపై పునఃసమీక్షించి నిధులు పెంచాలన్నారు. హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను బడ్జెట్ ప్రతిపాదనలు నీరుగార్చాయన్నారు. గత ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపివేసిన హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. తుంగభద్ర ప్రస్తావనే లేదన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పునకు రూ.6,700కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించగా రూ.867.75కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలకు ప్రస్తుతం కేటాయించిన నిధులు సరిపోవన్నారు. పీఏబీఆర్ కుడికాలువ, యాడికి కాలువ, సుబ్బరాయ సాగర్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

పేదలు ఆత్మగౌరవంతో జీవించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రసంగిస్తున్న రామకృష్ణ

అనంతపురం కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో జీవించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని నవయుగ కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి పట్టాల దరఖాస్తుల నమోదు కార్యక్రమాన్ని మంగళ వారం చేపట్టారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, నవయుగ కాలనీ కార్యదర్శి రాజు సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై కాలనీవాసులకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున పేదలకు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేయాలని కోరారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవయుగ కాలనీలోని ఐదున్నర ఎకరాల్లో ఉంటున్న 180 కుటుంబాలకు పట్టాలిప్పించి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇప్పించే దిశగా ఈ కాలనీ నుంచే పట్టాల దరఖాస్తు కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ఈనెల 18న వ్యక్తిగత అర్జీల సమర్పణ కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే కార్యక్రమంలో సచివాలయాల వద్ద అర్జీలను ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, లింగమయ్య, సంతోష్‌కుమార్, కృష్ణుడు, అల్లీపీర, రమణయ్య, జయంతి, ఇన్సాఫ్, ఖాజాహుస్సేన్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అపార్‌పై నిర్లక్ష్యం వద్దు

ప్రతి విద్యార్థి వివరాలు జనరేట్ చేయాలి

డ్రాపౌట్స్ వివరాలు వెంటనే పంపాలి


విద్యాశాఖ సమీక్షలో కలెక్టరు

అనంతపురంటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అపార్ కార్డు జనరేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లో విద్యా అనుబంధశాఖల అధికారులు, ఎంఈఓలతో కలెక్టరు మంగళవారం సమావేశం నిర్వహించారు. తొలుత మండలాల వారీగా అపార్ జనరేషన్ ఎంతవరకు అయిందో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖల యుడైస్ లెక్కల మేరకు జిల్లాలో 2024-25విద్యాసంవత్సరంలో 3,70,767మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఇందులో ఇప్పటివరకు 2,17,892 మంది పిల్లలకు అపార్ జనరేట్ అయిందన్నారు. ఈలెక్కన ఇప్పటికి 58.76శాతం మాత్రమే పూర్తయిందన్నారు. ప్రతి మండలాన్ని రెండుగా విభజించి ఇద్దరు ఎంఈఓలకు అపార్ బాధ్యతలు అప్పగించాలని విద్యాశాఖాధికా రులను ఆదేశించారు. జిల్లాలో 174 ఆధార్ కిట్లు ఉండగా ఇందులో 64 పాడైపోయాయని, మిగిలిన 110 ఆధార్ కిట్లు సచివాలయాలు, మీసేవ, పాస్‌పోర్టు కార్యాలయాలలో ఏర్పాటు చేసి రెండు షిఫ్టులుగా సిబ్బందిని నియమించి అపార్ జనరేషన్ వేగంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతిపాఠశాలలోను ప్రొఫైల్ అప్డేషన్‌కి ఒకటి, అపార్ ఐడీకి ఒకటి, నామినల్‌రోల్స్‌కు ఒకటి చొప్పున మూడు బృందాలను ఏర్పాటుచేసి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని డీఈఓను ఆదేశించారు.

డ్రాపౌట్స్ వివరాలు పక్కాగా ఇవ్వండి

జిల్లాలో 17,901 మంది డ్రాపౌట్ విద్యార్థులు ఉన్నట్లు లెక్క తేల్చారని కలెక్టర్ వెల్లడించారు. ఆ డ్రాపౌట్స్‌కు సంబంధించిన వివరాలను పక్కాగా అందజేయాలని ఆదేశించారు. టీచర్స్ హాజరు పూర్తి స్థాయిలో ఉండాలని, డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు నిరంతరం పాఠశాలల తనిఖీలు చేపట్టి, వాటి నివేదికలు పంపాలని ఆదేశించారు. విద్యావ్యవస్థను జిల్లాలో ఆదర్శంగా నిలపాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఈఓ ప్రసాద్ బాబు, డీపీఓ నాగరాజునాయుడు, ఏపీసీ నాగరాజు, వెల్ఫేర్ ఆఫీసర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్.. కాలవ



రాయదుర్గం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును విప్‌గా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిస్టుగా ఉంటూ రాజకీయాల్లో ప్రవేశించిన ఆయన తొలి ప్రయత్నంలోనే ఎంపీగా ఎన్నికయ్యారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు. రాయదుర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా, చీఫ్ విప్‌గా పని చేశారు. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన ఆయనకు మరోమారు ప్రాధాన్యం ఇచ్చారు.

న్యూస్‌బాక్స్

తాగునీటి సమస్య తలెత్తకూడదు
: ఎంపీ అంబికా


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదేశించారు. నగర శివారులోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో పలు అంశాలపై ఎంపీ సమీక్ష నిర్వహించారు. అవసరమైన ప్రాంతాల్లో మదర్ ప్లాంట్స్‌కు సీఎస్ఆర్ నిధులను ఉపయోగించాలని సూచించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికగా వాటర్ ట్యాంక్‌లను నిర్మించి.. పైప్ లైన్ ఏర్పాటు చేయించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

జాతీయ పోటీలకు ఖాసీంబీ


ఖాసీంబీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో యూనివర్సిటీ విద్యార్థులకు నిర్వహించే జూడో పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఖాసీంబీ ఎంపికైనట్లు డీఎస్ఏ కోచ్ అలీ తెలిపారు. ఈనెల 15 నుంచి భోపాల్‌లో నిర్వహించే సౌత్‌జోన్ జూడో యూనివర్సిటీ టోర్నీలో ఈమె ఎస్కే యూనివర్సిటీ తరఫున పాల్గొననుంది. ఎంపికైన ఖాసీంబీని డీఎస్ఏ కోచ్ అలీ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు, తోటి కోచ్‌లు అభినందించారు.

రేపు ఆర్డీటీలో ఆర్ట్ ఫెస్టివల్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 14న ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో సెంట్రల్ లెవెల్ ఆర్ట్ ఫెస్టివల్-2024 నిర్వహించనున్నట్లు ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళీ తెలిపారు. 37 ప్రాంతాల నుంచి 222మంది చిన్నారులు రంగోలి, హ్యాండ్ రైటింగ్, న్యాచురల్ కొలేజ్, పిక్చర్ పెయింటింగ్, క్లేమోడల్, ఒరిగామి ఆర్ట్ వర్క్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథులుగా ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్ హాజరవుతారన్నారు.

'డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరును వేగవంతం చేయండి'

అనంతపురం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరును మరింత వేగవంతం చేయాలని ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు మంగళవారం ఆదేశించారు. ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో గుంటూరు నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి దాకా 3462 మంది రైతులు 4094 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతు వాటా డబ్బులను డిజిటల్ పద్ధతిలో చెల్లించారన్నారు. వీరిలో 2600 మంది రైతులకు 3081 హెక్టార్లకు కలెక్టర్ పరిపాలన అనుమతుల ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈనెలాఖరులోగా పెండింగ్‌లోని ప్రాథమిక విచారణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సకాలంలో రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను సరఫరా చేయడంతోపాటు పొలాల్లో బిగించేలా ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు.

820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో ప్రస్తుతం 820 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 988 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.563 టీఎంసీల నీరు నిల్వ వున్నట్లు తెలిపారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.13, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.33వేలు

అనంతపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33,800 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.24 వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 43 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పైరవీలతో ప్రమోషన్‌లు

పీఆర్‌లో నిబంధనలకు పాతర

- జోన్-4లో మెరిట్ ఉన్నవారికి అన్యాయం
- అడ్డగోలుగా ఏపీపీఎస్సీ రిజర్వేషన్ అమలు
- తెరవెనుక ఇద్దరు యూనియన్ నాయకులు
- అనర్హులకు డీఈఈగా ఉద్యోగోన్నతి
- ఈఎన్‌సీకి ఫిర్యాదు చేయాలని బాధితుల నిర్ణయం

అనంతపురం సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీరాజ్ శాఖ జేఈలను డీఈఈల ఉద్యోగోన్నతి కల్పించే విషయంలో ఆ శాఖ ఉన్నతాధికారులు నిబంధనలను పాటించలేదు. పైసలిస్తే అనర్హులకు ఉద్యోగోన్నతి కల్పించారు. ఇద్దరు యూనియన్ నాయకులు అప్పటి ఈఎన్‌సీతో కలిసి పైరవీలు చేసి రూ.కోట్లలో సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా అలాంటి ఆరోపణలే వస్తున్నాయి. ఇటీవల జరిగిన ఉద్యోగోన్నతుల పక్రియ దీనికి కారణం. వైసీపీ హయాంలో చక్రంతిప్పిన ఆ ఇద్దరు యూనియన్ నాయకుల ద్వారానే ప్రస్తుత ప్రభుత్వంలోను ఉద్యోగోన్నతుల దందా సాగిందని అంటున్నారు. నిబంధనలకు పాతరేసి, అనర్హులను అందలమెక్కించారని ఆ శాఖ వర్గాలు అంటున్నాయి. రాష్ట్రంలోని అన్ని జోన్లలో ఇదే తరహా ఆరోపణలు వస్తున్నాయి. కాసులిచ్చుకో.. ఉద్యోగోన్నతి ఉత్తర్వు పట్టుకో అన్నట్లుగా వ్యవహారం సాగిందని అంటున్నారు.

తెరవెనుక ఇద్దరు నాయకులు

వైసీపీ హయాంలో జరిగినట్లుగానే కూటమి ప్రభుత్వంలోను ఉద్యోగోన్నతుల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు, ఆ శాఖ రాష్ట్ర స్థాయి యూనియన్ నాయకులు ఇద్దరి ద్వారా ఉద్యోగోన్నతుల పైరవీలు జరిగాయి. ప్రస్తుత ఈఎన్‌సీకి కొంత మంచిపేరు ఉన్నా.. ఆ ఇద్దరు నాయకుల కారణంగా చెడ్డపేరు వస్తోందని అంటున్నారు. గత ఈఎన్‌సీపై లెక్కలేనన్ని ఆరోపణలు వచ్చాయి. బదిలీలు, ఉద్యోగోన్నతులు, ఎఫ్ఏసీల రూపంలో రెడ్డి సామాజికవర్గం వారికి ప్రాధాన్యం ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. ఐదేళ్లలో నష్టపోయిన అధికారులకు కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని అనుకున్నారు. కానీ యూనియన్ నాయకులు, ఆశాఖ ఉన్నతాధికారుల వ్యవహార శైలి కారణంగా మళ్లీ అన్యాయమే జరుగుతోంది. ఆ నాయకులు, అధికారులు కుమ్మక్కై, ఏపీపీఎస్సీ ద్వారా వచ్చిన వారికి కాకుండా నాన్ ఏపీపీఎస్సీ కింద వచ్చిన 1991, 1994 బ్యాచ్ వారికి ఉద్యోగోన్నతులలో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని అంటున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున కాసులు చేతులు మారాయని తెలుస్తోంది.

ఏపీపీఎస్సీ రిజర్వేషన్‌నే పాటించడంపై విమర్శలు

ఏపీపీఎస్సీ-1997 ద్వారా వచ్చిన జేఈలకు ఏళ్ల తరబడి అన్యాయం జరుగుతూనే ఉంది. ఏపీపీఎస్సీ ద్వారా వచ్చిన వారికి కాకుండా నాన్ ఏపీపీఎస్సీ వారికి ఉద్యోగోన్నతులు ఇచ్చి ఆశాఖ ఉన్నతాధికారులు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏపీపీఎస్సీ 1997 బ్యాచ్‌లో మెరిట్‌లో ఉన్నవారికి కూడా అన్యాయం చేస్తున్నారు. 1997బ్యాచ్‌కు చెందిన 18మంది జేఈఈలకు ఆశాఖ ఈఎన్‌సీ ఇటీవల ఉద్యోగోన్నతులు కల్పించారు. ఇందులో ఏపీపీఎస్సీలో పాటించిన రిజర్వేషన్‌నే పాటించారు. దీంతో మెరిట్ ఉన్న ఓసీ ఉద్యోగులకు అన్యాయం జరిగింది. తద్వారా డీఈఈగా కూడా ఉద్యోగోన్నతి రాకుండా పోయింది. ఎక్కడైనా పోస్టులు భర్తీ చేసే సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ తదితర రిజర్వేషన్‌లను పాటించాలి. కానీ ప్రమోషన్‌ల విషయంలో మాత్రం కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్ కల్పించాలి. ఓసీ, బీసీలకు పోస్టుల భర్తీ సమయంలో వచ్చిన మెరిట్ ఆధారంగా ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఇలా జరగలేదు. తక్కువ మార్కులు వచ్చిన బీసీ వర్గాలకు కూడా ఏపీపీఎస్సీలో పాటించిన రిజర్వేషన్‌ను అమలు చేశారు. దీంతో ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందిన ఓసీలకు (బీసీలకంటే మెరిట్ ఎక్కువగా ఉన్నా) అన్యాయం జరిగింది. ఇటీవల జోన్-4లో ఇచ్చిన ఉద్యోగోన్నతులను పరిశీలిస్తే ఇది స్పష్టంగా తెలిసిపోతుంది. నాన్ ఏపీపీఎస్సీ బ్యాచ్‌ల వారికి కూడా గుట్టుగా ఉద్యోగోన్నతులు కల్పించారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని అన్ని జోన్లలో ఇదే పరిస్థితి ఉందని అంటున్నారు. ఈ తతంగాన్ని మొత్తం ఆ ఇద్దరు నాయకులు గుట్టుగా నడిపించారని ప్రచారం జరుగుతోంది.


జాబితాలో తేటతెల్లం

జోన్-4లో సుమారు 40 డీఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. వీటి భర్తీ కోసం 50 మంది జేఈలతో జాబితా రూపొందించారు. ఇందులో మెరిట్, రిజర్వేషన్‌ను ఇష్టారాజ్యంగా అమలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బీసీలకు రిజర్వేషన్ ఇచ్చారు. మెరిట్ ఉన్న ఓసీలను దిగువకు తోశారు. 50 మంది జాబితాలో తొలి 18 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. నిబంధన మేరకు ప్రమోషన్‌లు ఇచ్చి ఉంటే.. ఆ 18 మందిలోనే మెరిట్ ఉన్న ఓసీ ఇంజనీర్లు ఉండేవారు. ఉద్యోగోన్నతి పొందేవారు.


ఉమ్మడి అనంతపురం జిల్లా పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయం

భారీగా పైరవీలు..

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జోన్-4లో సుమారు 40 డీఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. రాయలసీమ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లా అధికారులు ఎవరికి వారు తమదైన శైలిలో పోస్టింగ్‌ల కోసం కథ నడిపించారు. రెగ్యులర్ డీఈఈల కొరత ఎక్కువగా ఉంది. జేఈలకు డీఈఈలుగా ఎఫ్ఏసీ, అడహక్ కింద డీఈఈ ఉద్యోగోన్నతులు ఇవ్వడం మొదలుపెట్టారు. జిల్లాల వారిగా ఎవరిస్థాయిలో వారు సిఫార్సులు మొదలు పెట్టారు. ఇదే అదునుగా భావించిన కొందరు జేఈలు రాష్ట్ర స్థాయిలోని యూనియన్ నాయకులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా డీఈఈ ఉద్యోగోన్నతులు పొందారని సమాచారం. మరికొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ఉద్యోగోన్నతులు పొందారని తెలిసింది. ఈ కారణంగా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల వద్ద పలుకుబడి లేని ఓసీ వర్గాలు డీఈఈ ఉద్యోగోన్నతులను కోల్పోయారు. జోన్-1, జోన్-2, జోన్-3లో కూడా ఇదే తరహాలో ప్రమోషన్‌ల పక్రియ సాగిందని సమాచారం.

ప్రతిభ ఉన్నా..

రాష్ట్ర వ్యాప్తంగా ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికై పనిచేస్తున్న జేఈలకు నిబంధనలకు అనుగుణంగా ప్రమోషన్లను కల్పించడం లేదని, ఏళ్ల తరబడి అన్యాయం చేస్తున్నారని ఆ శాఖ వర్గాలు వాపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రిజర్వేషన్ అమలు చేసి మెరిట్ కలిగిన ఓసీ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని, అనర్హులకు డీఈఈలుగా అడహక్, ఎఫ్ఏసీ కింద ఉద్యోగోన్నతి కల్పించడం ఏమిటని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, భవనాలు శాఖలోనూ ఉద్యోగోన్నతుల విషయంలో ఇదే తరహా రిజర్వేషన్ అమలు చేసి, అనర్హులకు డీఈఈలుగా అవకాశం కల్పించడంతో బాధిత వర్గాలు కోర్టుకెళ్లాయి. దీంతో ఉద్యోగోన్నతులను వెంటనే రద్దు చేయాలని కోర్టు ఆదేశించింది. ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు ప్రమోషన్‌లను రద్దు చేసి, అర్హులకు అవకాశం కల్పించారు. కానీ పీఆర్‌లో మాత్రం అక్రమాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మెరిట్ ప్రాదిపదిక నష్టపోయిన ఓసీలు త్వరలోనే ఈఎన్‌సీ, ఆ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు.

మా చేతుల్లో ఉండదు

జేఈ నుంచి డీఈఈలుగా ఉద్యోగోన్నతులు కల్పించే అధికారం మా చేతుల్లో ఉండదు. ఈఎన్‌సీ స్థాయిలో జరుగుతుంది. ఏవైనా లోపాలు ఉంటే సదరు అధికారికి సంబంధించి సమగ్ర నివేదిక అడుగుతారు. ఓసీ వర్గాలకు అన్యాయం జరిగిందనే విషయం మా దృష్టికి రాలేదు. ఒకవేళ వస్తే.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఈఎన్‌సీని అడిగితే సమగ్ర వివరాలు తెలుస్తాయి.

జహీర్ అస్లాం, పీఆర్ ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్ఈ

కాయను తొలిచేస్తోంది

కందిలో కాయతొలుచు పురుగు ఉధృతి
పంట దిగుబడిపై తీవ్రప్రభావం

యాడికి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాయ తొలుచు పురుగుతో కంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 4151ఎకరాల్లో కందిపంట సాగైంది. ప్రస్తుతం కందిపంట పూత, పిందెదశలో ఉంది. కందిపంటలో పూత బాగా రావడంతో ఈ సారి పంట బాగా పండుతుందని రైతులు ఆశించారు. అయితే పూత, పిందె దశలో ఉన్న కందిపంటలో కాయతొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో పిందె దశలోనే పంట ధ్వంసమవుతోంది. లేత కందికాయలపై కూడా కాయ తొలుచు పురుగు ఎక్కువగా కనిపిస్తోందని రైతులు తెలిపారు. ఇది కాయలకు చిన్న, చిన్న రంధ్రాలు చేసి తినేస్తోందని, దీంతో దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు వివిధరకాల మందులను పిచికారీ చేశామని పలువురు రైతులు తెలిపారు. అయినా కాయతొలుచు పురుగు అదుపులోకి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కందిపంటను పరిశీలించి, నివారణకు సస్యరక్షణ చర్యలను సూచించాలని రైతులు కోరుతున్నారు.

కాయతొలుచు పురుగు ఎక్కువగా ఉంది

కందిపంటలో కాయతొలుచు పురుగు ఎక్కువగా ఉంది. పూతదశ నుంచి పిందెలు పడే సమయంలో ఈ పురుగు ఎక్కువగా కనిపిస్తోంది. కందికాయను అంతా తొలిచేస్తోంది. కందిపూత ఆశాజనకంగా ఉన్నప్పటికి పురుగు ఉధృతి వల్ల దిగుబడిపై ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రకరకాల మందులు కొట్టినా ఈ కాయతొలుచు పురుగు అదుపులోకి రావడం లేదు.

- రాముడు, యాడికి


కాయతొలుచు పురుగు

ఎన్ని మందులు కొట్టినా అంతే..

కందిలో కాయతొలుచు పురుగు ఎక్కువగా ఉంది. పూత, పిందెలను నాశనం చేస్తోంది. నివారణకు ఎన్ని మందులు వాడినా ఉధృతి తగ్గడం లేదు. ఆకాశం మేఘావృతం అవుతూ ఉండటంతో ఈ పురుగు మరింత ఎక్కువ అవుతోంది. కాయతొలుచు పురుగు ఉధృతి ఇలాగే కొనసాగితే పంట దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉంది. వ్యవసాయశాఖ అధికారులు కందిపంట పొలాలను పరిశీలించి, తగిన సలహాలు ఇవ్వాలి.

- నాగరాజు, యాడికి


కాయతొలుచు పురుగు ప్రభావంతో దెబ్బతింటున్న పూత

సస్యరక్షణ చర్యలతోనే నివారణ



కందిపంటలో తగు సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన కాయతొలుచు పురుగును నివారించవచ్చు. అస్పేట్ 75 ఎస్‌పీ 15గ్రాములు లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్జీ 3గ్రాములు లేదా ఫ్లూబెండియామైడ్ 480 ఎస్సీ 3మి.లీ లేదా స్పినోసాడ్ 45 ఎస్సీ 4 మి.లీ లేదా డెల్టామెత్రిన్ 1శాతం+ ట్రయోజోఫోస్ 35శాతం ఇసీ 10మి.లీ లేదా ఫ్లూబెండియామైడ్ 20డబ్ల్యూజి 5గ్రాములు 10లీటర్ల నీటికి కలిపి మొక్కల మీద పిచికారీ చేయాలి. ప్రతి స్ప్రేకు పురుగుమందును మార్చి వాడాలి. కూరగాయల కోసం సాగుచేసే కందిపంటలో మోనోక్రోటోఫాస్‌ను పిచికారీ చేయవద్దు.

- మహబూబ్‌బాషా, ఏఓ

కుస్తీ పోటీల్లో బంగారు పతకాలు


రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో జిల్లాకు బంగారు పతకాలు దక్కాయి. చిత్తూరు జిల్లాలో ఈనెల 11న నిర్వహించిన ఎస్‌జీఎఫ్-17 బాల, బాలికల రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో రోహిత్‌కుమార్ బంగారు పతకం, భరత్, సాయి భార్గవ్‌లు రజత పతకం, శ్రీనాథ్, రాఖీలు కాంస్య పతకాలు సాధించారు. బాలికల విభాగంలో రాణి బంగారు పతకం సాధించగా, సాకే స్పందన కాంస్య పతకం సాధించింది. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు డిసెంబరు 23 నుంచి న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి కుస్తీపోటీల్లో పాల్గొంటారని శాప్ కోచ్ రాఘవేంద్ర తెలిపారు. క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ రెండు జిల్లాల కార్యదర్శులు సుగుణమ్మ, మొరార్జీయాదవ్ అభినందించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

ఉమ్మడి జిల్లా ఎరువుల డీలర్ల సంఘం అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు


సుబ్బారావును కలిసిన డీలర్ల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలోని డీలర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఉమ్మడి జిల్లా ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల డీలర్ల సంఘం అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు కోరారు. డీలర్ల నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గంగాధర్, రవి, కోశాధికారి రమేష్ రంగయ్య మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. డీలర్లకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే, తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రభాకర్, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

రాక్రీట్‌కు ఉపాధి.. కలకలం..!

హౌసింగ్, డ్వామా ఉద్యోగుల్లో అలజడి
ప్రభుత్వం విచారిస్తే వెలుగులోకి మరిన్ని అక్రమాలు

అనంతపురం సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాక్రీట్ సంస్థ ఉపాధి నిధులను దోచేసిన విధానంపై రాక్రీట్‌కు ఉపాధి.! శీర్షికన ఈ నెల 5న ప్రచురించిన కథనం హౌసింగ్ అధికారులు, డ్వామా ఏపీఓలతో పాటు ఆయా శాఖల ఉద్యోగుల్లో కలకలం రేపింది. సొంత ప్రాంతాల్లో పోస్టింగ్ పొంది అక్రమాలకు పాల్పడిన వారిలో వణుకు మొదలైంది. ఒకే ప్రాంతంలో సుదీర్ఘకాలం పనిచేసిన అధికారులు కూడా అందిన కాటికి దోచేశారని సమాచారం. కూటమి ప్రభుత్వం స్పందించి లోతుగా విచారణ చేస్తే జగనన్న ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

ఆ ప్రాంతాల్లో అధికం..

వైసీపీ ఐదేళ్ల పాలనలో జగనన్న ఇళ్ల నిర్మాణాల పేరుతో చేసిన అవినీతి అంతా ఇంతా కాదు. ఇక రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ ప్రతి ఇంటికి ఉపాధి కింద అందించే రూ. 30 వేలను హౌసింగ్, డ్వామా ఏపీఓలతో కలిసి స్వాహా చేసిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా భావించి ఇరుశాఖల అధికారుల కలిసి ప్రాంతాల వారిగా లబ్ధిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణాలు జరగకుండానే, ఏమాత్రం స్టేజ్‌లను పరిశీలించకుండానే అక్రమంగా బిల్లులు డ్రా చేసి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాప్తాడు, శింగనమల, ఉరవకొండ, కళ్యాణదుర్గం, తాడిపత్రి ప్రాంతాల్లో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా జరిగినట్లు సమాచారం.

లోతుగా విచారిస్తే..

అధికారం మారిన నేపథ్యంలో అధికారులు చిత్తశుద్ధిగా క్షేత్రస్థాయిలో లోతుగా విచారణ చేస్తే ఆయా ప్రాంతాల వారిగా అక్రమాలకు పాల్పడిన వారి బాగోతం వెలుగు చూసే అవకాశం ఉంది. డ్వామా గత పీడీపై వైసీపీ సానుభూతిపరుడనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఆయన గత పాలకుల ఆదేశించిన వెంటనే నిబంధన లు పాటించకుండా కొందరికి సొంత ప్రాంతాల్లోనే పోస్టింగ్ ఇచ్చి, అక్రమాలకు సహకరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఏపీఓలు ఉన్నప్పటికీ కక్షసాధింపులో భాగం గా (టీడీపీకి చెందిన ఏపీఓలు అని) టెక్నికల్ అసిస్టెంట్‌లకు కూడా ఏపీఓలుగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లో అధికంగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. సుమారు 8మంది సొంత ప్రాంతాల్లో పోస్టింగ్ పొంది అక్రమాలు తెరలేపారని తెలిసింది. ఇందులో గత పీడీ పాత్ర ఎంత వరకు ఉందో తెలియాల్సి ఉంది. గత ప్రభుత్వంలో హౌసింగ్‌లో పనిచేసిన ఉన్నతాధికారి కూడా ఇదే తరహా అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమాలన్నింటిపై కూటమి ప్రభుత్వం లోతుగా విచారణకు ఆదేశిస్తే అవినీతి బాగోతం మరింత వెలుగు చూసే అవకాశం ఉంది. ఇందులో రాక్రీట్ సంస్థ చేసిన దోపిడీ, హౌసింగ్, డ్వామా ఏపీఓలు, వారిపై ఉన్నతాధికారులు చేసిన తప్పిదాలు కూడా బయటకు వచ్చే అవకాశం ఉంది.

తనిఖీ బృందాల ఏర్పాటు


విడపనకల్లు మండలంలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరాముడు

అనంతపురం అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల విక్రయాలను తనిఖీ చేసేందుకు వ్యవసాయ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా బృందాల్లోని అధికారులు సోమవారం నుంచి క్షేత్ర స్థాయిలో తనిఖీలు మొదలు పెట్టారు. కళ్యాణదుర్గం డివిజన్‌కు అనంతపురం ఏడీఏ రవి, ఉరవకొండకు గుత్తి ఏడీఏ వెంకటరాముడు, గుత్తి డివిజన్‌కు తాడిపత్రి ఏడీఏ చంగల్‌రాయుడు, రాయదుర్గం డివిజన్‌కు ఉరవకొండ ఏడీఏ పద్మజ, తాడిపత్రి డివిజన్‌కు కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప, అనంతపురం డివిజన్‌కు రాయదుర్గం ఏడీఏ లక్ష్మీనాయక్‌లను కేటాయించారు. ఆయా డివిజన్ల పరిధిలోని వ్యవసాయ అధికారులతో కలిసి ఆయా ఏడీఏలు తనిఖీలు చేస్తున్నారు.

రూ. 5 లక్షల ఎరువులు సీజ్

విడపనకల్లు: మండలంలోని ఎరువుల దుకాణాలను ఇంటర్నల్ స్క్వాడ్ ఏడీఏ వెంకటరాముడు మంగళవారం తనిఖీ చేశారు. గడేకల్లు, విడపనకల్లు గ్రామాల్లోని ఎరువుల దుఖాణాలు తనిఖీ చేయగా జువారి జైకిసాన్ ఎరువుల షాపులో రికార్డులు సరిగా లేని రూ. 5లక్షలు ఎరువులను సీజ్ చేశారు. తనిఖీల్లో భాగంగా స్టాక్ రిజిస్టర్లు, ఇన్ వాయిస్, జీరో ఫాంలను పరిశీలించారు. లైసెన్స్‌లో ఇన్‌క్లూసివ్‌లో లేనివి పలు రకాల ఎరువులు, డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు, ఆర్గానిక్ ఫర్టిలైజర్స్ రికార్డులు లేకుండా ఉన్నాయని తెలిపారు. ఫర్టిలైజర్స్ షాపుల్లో ఎవరైనా ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పీకి కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. దుకాణాల తనిఖీ సమయంలో ఎవరైనా షాపులను బంద్ చేస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ హెచ్ పెన్నయ్య, ఏఈఓ జేవి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షల ఎరువుల విక్రయాలు నిలుపుదల

అనంతపురం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఏడీఏ లక్ష్మానాయక్, అనంతపురం ఏఓ శశికళ మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఆయా దుకాణాల్లో ఎరువులకు సంబంధించి స్టాక్ రిజిస్టర్ సక్రమంగా లేకపోవడంతో రూ.30 లక్షలు విలువైన ఎరువుల విక్రయాలను నిలిపేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడు తూ ఎరువులు, పురుగు మందులు, క్రిమిసంహారక మందుల దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. అలా పాటించకపోతే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కళ్యాణదుర్గంలో 38.65 టన్నులు..

కళ్యాణదుర్గం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. అనంతపురం ఏడీఏ రవి, కళ్యాణదుర్గం ఏఓ జగదీష్ బృందంగా ఏర్పడి పట్టణంలోని మధు ఫర్టిలైజర్స్‌ను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, అమ్మకాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో 38 టన్నుల 65 క్వింటాళ్ల ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీని విలువ రూ.5,60,850 ఉంటుందన్నారు. అనంతరం ఏడీఏ రవి మాట్లాడుతూ రైతులకు విక్రయించే ఎరువులు, పురుగు మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నాసిరకం పురుగు మందులు, ఎరువులు అమ్మినట్లు తెలిస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేయడానికి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న శివ, ఈశ్వరమ్మ

ఉరవకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకెట్ల గ్రామంలో మంగళవారం పొలంలోనే దంపతులు ఆత్మహత్యకు యత్నించా రు. గ్రామానికి చెందిన శివ, ఈశ్వరమ్మ దంపతులు వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గ్రామ సమీపంలోని పొలంలో పురుగు మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయారు. వీరిని గమనించిన కుటుంబసభ్యులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించాలని వైద్యులు సూచించారు. కుటుంబ సమస్యలతోనే ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హెచ్చెల్సీ వాటా



తుంగభద్ర జలాశయం



29.434 టీఎంసీలు

తుంగభద్ర డ్యాంలో 192 టీఎంసీల లభ్యత

2024-25 నీటి చేరికపై బోర్డు తుది అంచనా

టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశం

కర్నూలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువకాలువ (హెచ్చెల్సీ) వాటాను నిర్ణయించారు. ఈ నీటి సంవత్సరానికి 29.434 టీఎంసీలను కేటాయించారు. జలాశయంలో 192 టీఎంసీల వరద జలాలను వినియోగించుకోవచ్చని టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ అంచనా వేసింది. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) వాటాగా 21.736 టీఎంసీలు, కేసీ కెనాల్ వాటాగా 9.057 టీఎంసీలు చొప్పున కర్నూలు జిల్లాకు 30.793 టీఎంసీలు కేటాయించారు. అనంతపురం జిల్లాకు హెచ్చెల్సీకి 29.434 టీఎంసీలను కేటాయించారు. టీబీపీ బోర్డు ఇన్‌చార్జి ఎస్ఈ నీలకంఠరెడ్డి అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. నీటి సంవత్సరం జూన్ 1 నుంచి మే 31 వరకు 212 టీఎంసీలు వరద వినియోగించుకునేలా రిజర్వాయర్ డిజైన్ చేశారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్-1 (కేడబ్ల్యుడీటీ) అవార్డు ప్రకారం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కాలువలకు నికర జలాల కేటాయింపులు చేశారు. ప్రతి ఏటా నీటి సంవత్సరం ప్రారంభంలో టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశమై గడిచిన పదేళ్లుగా జలాశయంలో చేరిన వరద లెక్కలు ఆధారంగా నీటి చేరికపై అంచనా వేస్తారు. నవంబరు లేదా డిసెంబరులో తుది అంచనాలు వేస్తారు. ఈ నీటి సంవత్సరంలో జూన్ నెలలో జరిగిన సమావేశంలో 172 టీఎంసీలు చేరవచ్చని అంచనా వేశారు. అందుకు ఎక్కువగా వరద వచ్చింది. దీంతో 192 టీఎంసీలకు తుది అంచనా వేశారు. ఈ మేరకు కేడబ్ల్యూడీటీ అవార్డు దామాషా ప్రకారం పంపిణీ చేశారు.



ఏపీ వాటా 60.227 టీఎంసీలు

తుంగభద్ర జలాశయం నుంచి ఈ ఏడాది 192 టీఎంసీల వినియోగంపై అంచనా వేసి పంపకాలు చేశారు. బచావత్ అవార్డు ప్రకారం కర్ణాటక 138.990 టీఎంసీలకు గానూ 125.878 టీఎంసీలు(65.56 శాతం), ఆంధ్రప్రదేశ్ వాటా 66.50 టీఎంసీలకుగానూ 60.227 టీఎంసీలు(31.37 శాతం), తెలంగాణ 6.51 టీఎంసీలకు గానూ 5.896 టీఎంసీలు (3.07 శాతం) కేటాయించారు. కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీ వాటా 24 టీఎంసీలకుగానూ 21.736 టీఎంసీలు, కేసీ కాలువ వాటా 10 టీఎంసీలకు గానూ 9.057 టీఎంసీలు, అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ వాటా 32.50 టీఎంసీలకు గానూ 29.434 టీఎంసీలు కేటాయించారు.

33.071 టీఎంసీల మిగులు

ఎల్లెల్సీ వాటాలో 21.736 టీఎంసీలకుగానూ 8.526 టీఎంసీలు వాడుకున్నారు. మరో 13.21 టీఎంసీలు మిగులు ఉన్నాయి. కేసీ కెనాల్ వాటా 9.057 టీఎంసీల్లో ఏమాత్రం వాడుకోలేదు. అనంతపురం జిల్లాకు హెచ్చెల్సీ వాటా 29.434 టీఎంసీలు కేటాయించగా.. ఇప్పటికే 18.629 టీఎంసీలు వాడుకున్నారు. మరో 10.805 టీఎంసీలు మిగులు ఉన్నాయి. ఈ లెక్కన రాష్ట్ర వాటాలో 60.227 టీఎంసీలకుగాను 27.155 టీఎంసీలు ఇప్పటికే వినియోగించుకున్నారు. డ్యాంలో 33.071 టీఎంసీలు మిగులు ఉన్నాయి.

రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులు (టీఎంసీల్లో..)

రాష్ట్రం	వాటా	కేటాయింపు
కర్ణాటక	138.990	125.878
ఆంధ్రప్రదేశ్	66.500	60.226
తెలంగాణ	6.510	5.896
మొత్తం	212.00	192.00

ఏపీ వాటాలో కాలువకు కేటాయింపులు (టీఎంసీల్లో..)

కాలువ	వాటా	కేటాయింపు	వాడుకున్నది	మిగులు
ఎల్లెల్సీ	24.00	20.736	8.526	13.21
కేసీ కెనాల్	10.00	9.057	–	9.057
హెచ్చెల్సీ	32.50	29.434	18.629	10.805
మొత్తం	66.50	60.227	27.155	33.071



పరిమళ | కురుబ శ్రీనివాసులు | బలుగుండ్ల శ్రీనివాసులు

విధేయులకు అందలం..!

కురుబ కార్పొరేషన్‌లో జిల్లా వాసులకు పట్టం

డైరెక్టర్లుగా నలుగురి నియామకం

పుట్టపర్తి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన కార్పొరేషన్ పదవుల్లో విధేయులకు అందలం దక్కింది. రాష్ట్ర కురుబ కార్పొరేషన్‌లో జిల్లా నుంచి నలుగురికి చోటు లభించింది. ఇందులో కురుబ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులుగా టీడీపీ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరికి అవకాశం దక్కింది. హిందూపురం నుంచి మాజీ కౌన్సిలర్, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, పెనుకొండ మండలం రాంపురం మాజీ సర్పంచ్, టీడీపీ నేత కురుబ శ్రీనివాసులు, కొత్తచెరువు మండలం గోరంట్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త బలుగుండ్ల శ్రీనివాసులు, బీజేపీ నుంచి రాప్తాడు నియోజకవర్గం కృష్ణంరెడ్డిపల్లికి చెందిన కాటమయ్యను సభ్యులుగా ఎంపిక చేశారు. జిల్లాకు నాలుగు పదవులు దక్కడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పలు కార్పొరేషన్ల డైరెక్టర్లుగా జిల్లా నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన నాయకులకు పలు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా అవకాశం దక్కింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం జాబితాను విడుదల చేసింది. కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా శింగనమల నియోజకవర్గానికి చెందిన టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, రాయదుర్గానికి చెందిన జనసేన నాయకుడు మంజునాథ్, కళ్యాణదుర్గానికి చెందిన టీడీపీ నాయకుడు నీలస్వామిని నియమించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా రాయదుర్గానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటేశప్పను నియమించారు.

పోక్సో కేసులో జీవిత ఖైదు

గోరంట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారసింహపల్లికి చెందిన గొల్ల ఆదినారాయణ (54)కు పోక్సో కేసులో జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం స్పెషల్ సెషన్స్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పు వెలువరించారు. రూ.వెయ్యి జరిమానా కూడా విధించారు. ఈ కేసు వివరాలను గోరంట్ల అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ శేఖర్ వెల్లడించారు. 2020 నవంబరు 18వతేదీన ఆదినారాయణ ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి గోరంట్ల సీఐ జయనాయక్ పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి అనంతపురం దిశ డీఎస్పీ, ప్రస్తుత జిల్లా ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేసి, అనంతపురం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పదిమంది సాక్షులను న్యాయాధికారి విచారించారు. ఆదినారాయణపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సమస్యలపై నేరుగా సంప్రదించండి

పోలీసు సిబ్బందికి ఎస్పీ సూచన



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోలీసు సిబ్బంది తనను నేరుగా సంప్రదించవచ్చని ఎస్పీ రత్న సూచించారు. స్థానిక డీపీఓలో మంగళవారం పోలీసు దర్బార్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది సమస్యలపై ఎస్పీ అర్జీలు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఏఆర్ సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీసు దర్బార్ నిర్వహించామన్నారు. తన పరిధిలోని సమస్యలన్నింటినీ ఇక్కడే పరిష్కరిస్తానన్నానంనను. మేజర్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏఆర్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలన్నారు.

కారుణ్య నియామకం

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు చెన్నప్ప భార్య చంద్రకళకు ఎస్పీ కారుణ్య నియామకం కల్పించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు నాగప్ప భార్యకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేసియా చెక్కును ఎస్పీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

ఆరు మోటారు సైకిళ్ల స్వాధీనం



దొంగలు, మోటారు సైకిళ్లను చూపుతున్న సీఐ

తాడిపత్రి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చుక్కలూరు బ్రిడ్జి వద్ద మంగళవారం ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి ఆరు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. చుక్కలూరు బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన నారాయణ, హరిజనవాడకు చెందిన పెద్దన్న, మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన తెలికి రఫీ అటువైపు వచ్చారని సీఐ తెలిపారు. దీంతో వారిని తనిఖీ చేసి, విచారించగా విషయం బయటపడిందన్నారు. అనంతరం వివిధప్రాంతాల్లో దొంగిలించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు
దరఖాస్తు చేసుకోండి

బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ మంగళవారం ప్రకటనలో కోరారు. టెట్‌లో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇందులో బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం, ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఈబీసీ అభ్యర్థులకు 10 శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. మొత్తం 220 మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తులు చేసుకోని వారు రేపటిలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నవంబరు 16 నుంచి 60 రోజుల పాటు శిక్షణతో పాటు, 75 శాతం హాజరు ఉన్న వారికి స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. డీఎస్సీ(ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్), టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు టెట్ మార్కుల జాబితా, టీసీ, డిగ్రీ మార్కుల లిస్టు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్కు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతపరిచి జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీసర్కిల్లో దరఖాస్తులను అందజేయాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 2 లక్షలలోపు ఉండాలన్నారు. వివరాలకు ఫోన్: 08554-275575, సెల్: 7799043773కు సంప్రదించాలన్నారు.

వైభవం.. వెండిరథ
ప్రాకారోత్సవం

కదిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుడికి వెండిరథ ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. వెండిరథంపై కొలువుదీరిన స్వామివారికి సుగంధ పుష్పాలు, కదిరి మల్లెలు, తులసీమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారోత్సవం వైభంగా సాగింది. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



వెండిరథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

అద్భుత నైపుణ్యం.. సీమ విద్యార్థుల సొంతం

స్టూడెంట్ ఎక్స్ఛేంజ్‌తో అద్భుతాలు సృష్టించవచ్చు

జపాన్ డెలిగేట్స్‌తో జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమ విద్యార్థుల్లో అద్భుత నైపుణ్యాలున్నాయి. అయితే కమ్యూనికేషన్స్ స్కిల్స్‌లో పూర్‌గా ఉన్నారు. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ద్వారా ఈ సమస్యను అధిగమించి, వారితో అద్భుతాలు సృష్టించవచ్చునని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. విజయవాడలో జపాన్ డెలిగేట్స్, రాష్ట్ర వర్సిటీల వీసీలతో ప్రభుత్వం మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేసిందన్నారు. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్, డ్యూయల్ డిగ్రీ, జాయింట్ రీసెర్చ్ కొలాబ్రేషన్స్ ప్రోగ్రామ్స్‌పై జపాన్ బృందంతో చర్చించినట్లు తెలిపారు. అంతర్జాతీయంగా అన్ని దేశాలతో జేఎన్‌టీయూ ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) కలిగి ఉన్నామని, ఇందుకు ప్రత్యేకంగా ఫారిన్ అఫైర్స్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసినట్లు బృంద సభ్యులకు వివరించామన్నారు. టీచింగ్, రీసెర్చ్ మెథడ్స్‌పై రీసెర్చ్ చెద్దామని ప్రతిపాదించినట్లు తెలిపారు. ప్రాజెక్ట్ సూపర్ వైజర్‌గా జపాన్ ప్రొఫెసర్, కో సూపర్ వైజర్‌గా జేఎన్‌టీయూ ప్రొఫెసర్, జపాన్ ప్రాజెక్టులకు జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కో ఇన్వెస్టిగేషన్‌గాను. జేఎన్‌టీయూ ప్రాజెక్టులకు జపాన్ ప్రొఫెసర్ కో ఇన్వెస్టిగేషన్‌గా వ్యవహరించవచ్చునని తెలిపినట్లు వివరించారు. మన విద్యార్థులు ఇక్కడ ఒకటిన్నర సంవత్సరం థియరీ పూర్తిచేసుకుని మిగిలిన ప్రోగ్రాంను జపాన్‌లో పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరామన్నారు. విద్యార్థుల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా జపాన్‌లో చదివేందుకు తక్కువ ఫీజు నిర్ధారించాలని కోరినట్లు వెల్లడించారు. జపాన్ బృందంలో టొయామా జిల్లా పరిశ్రమల వ్యవహారాల డైరెక్టర్ హాంగో యు మిస్, ఏపీ నుంచి ఐ టోబో, మురాటా, అకిరో యోకాటా, ఏపీ నుంచి వర్సిటీల అధికారులు పాల్గొన్నారని తెలిపారు.



జపాన్ బృందంతో జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ

పసిపిల్లలను కాపాడటమే లక్ష్యం

నిమోనియాపై ప్రత్యేక కార్యక్రమం

ఇంటింటి సర్వేతో బాధితుల గుర్తింపు

వెల్లడించిన ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ, డీఐఓ

అనంతపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పసి పిల్లలను నిమోనియా వ్యాధి నుంచి కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, డీఐఓ డాక్టర్ యుగంధర్ తెలిపారు. జిలా కార్యాలయంలో ప్రపంచ నిమోనియా నివారణ దినాన్ని పురస్కరించుకొని ఇంటింటి సర్వే కార్యక్రమ పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శ్వాసకోశ వ్యాధులు పసిపిల్లల ప్రాణాలు హరిస్తున్నాయన్నారు. వివిధ రకాల వ్యాధులతో ఏటా ప్రతి వెయ్యి మందిలో 32మంది చిన్నారులు చనిపోతుంటే ఇందులో నిమోనియాతో మృతి చెందేవారు ఐదుగురు ఉంటున్నారని వెల్లడించారు. ప్రధానంగా చలికాలంలో పిల్లలకు శ్వాసకోశ సమస్యలు అధికమయ్యే అవకాశం ఉందని, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమోనియా నుంచి పసి పిల్లల ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఇంటింటికి వైద్య సిబ్బందిని పంపుతోందన్నారు. నిమోనియాతో బాధపడే పిల్లలను గుర్తించి, వారిని సకాలంలో ఆస్పత్రులకు పంపి, చికిత్స అందించడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అలాగే నిమోనియా వ్యాధి గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలో 0-5ఏళ్లవయసులోపు పిల్లలు 2,79,980మంది ఉన్నారన్నారు. ఆయా ఇళ్లకు 1600మంది ఆశాకార్యకర్తలు, 600మంది ఏఎన్ఎంలు, 400మంది ఎంఎల్‌హెచ్‌పీలు వెళ్లి పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీస్తారని తెలిపారు. ఈ ఇంటింటి సర్వే ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని డీఎంహెచ్‌ఓ, డీఐఓలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ గంగాధరరెడ్డి, ఏఓ గిరిజామనోహర్‌రావు, ఎస్ఓ మహమ్మద్‌రఫీ, డెమోలు త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నిమోనియా సర్వే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

లేటెందుకు.. చర్యలు తీసుకోండి

రికార్డులు అప్పగించకపోవడంపై చర్యలకు సిఫారసు

యాడికి ఎంపీడీఓ కార్యాలయంలో అవినీతిపై జడ్పీ సీఈఓకు నివేదిక

యాడికి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 2019నుంచి 2023వరకు నిధుల వినియోగంపై రికార్డులు అప్పగించని అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తూ గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి.. జడ్పీ సీఈఓకు నివేదిక పంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2019-20 నుంచి 2022-23 వరకు రికార్డులు అప్పగించని అధికారులపై ఎటువంటి చర్యలు చేపడతారోననే చర్చ మండల వ్యాప్తంగా జరుగుతోంది. 2019-20 నుంచి 2022-23 యాడికి మండల పరిషత్ నిధుల్లో సీనరేజస్ సెస్ కోట్ల రూపాయల్లో జమ అయి ఉన్నాయని, ఆ నిధులు నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారని, ఆ పనులపై విచారణ చేయాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారని నివేదికలో పేర్కొన్నారు. దీనిపై విచారణ అధికారిగా గుంతకల్లు డీఎల్‌డీఓ యాడికి ఎంపీడీఓ కార్యాలయంలో అక్టోబరు నెలలో విచారణ చేశారు. విచారణ సమయంలో గతంలో పనిచేసిన ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, పీఆర్ ఏఈలు వరప్రసాద్, ఆదినారాయణరెడ్డి, ఆంజనేయులు, దేవకుమార్‌లు హాజరయ్యారు. మరికొందరు అధికారులు విచారణకు గైర్హాజరయ్యారు. సాధారణ నిధులకు సంబంధించిన రికార్డులు, క్యాష్‌బుక్స్, వోచర్లు, వర్క్‌లిస్టు మండల పరిషత్‌లో ఆమోదించిన తీర్మానాలు విచారణ సమయంలో అందివ్వలేదు. 2019-20లో సాధారణ నిధులకు సంబంధించిన క్యాష్‌బుక్ మాత్రమే విచారణలో చూపించినట్లు తెలిసింది. 2019-23కు సంబంధించిన ఎటువంటి రికార్డులు ఇవ్వలేదు. 2019-23 మధ్యకాలంలో రూ.3,54,23,290 సీఎఫ్ఎంఎస్ ద్వారా లావాదేవీలు జరిపినట్లు విచారణలో తేల్చారు. ఈఎండీ ద్వారా 9-6-2021న బి. రామచంద్రారెడ్డికి రూ.50వేలు, 19-6-21న రూ.2.50లక్షలు సెల్ఫ్‌గా, అదే ఏడాది జూలై 9న రూ.1.40లక్షలు, 20-1-22న రూ.7వేలు, 19-6-24న రూ.26వేలు సెల్ఫ్‌గా డ్రా చేసుకున్నట్లు బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో గుర్తించారు. వీటికి సంబంధించిన రికార్డులు కూడా ఎంపీడీఓ కార్యాలయంలో లేవని తెలిపారు. రికార్డులు అందించడానికి 15రోజులు సమయం ఇచ్చినా ఆ అధికారులు రికార్డులు ఇవ్వలేకపోయారని నివేదికలో తెలిపారు. సంబంధిత అధికారులపై సీసీఏ రూల్స్ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఎల్‌డీఓ విజయలక్ష్మి జడ్పీ సీఈఓకు నివేదిక ఇచ్చారు.



నిధుల దుర్వినియోగంపై విచారణ చేస్తున్న డీఎల్‌డీఓ (ఫైల్)

పోలీసులు చట్టం పరిధిలో పనిచేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పోలీసులు రాజకీయ పార్టీల కోసం కాకుండా చట్టం పరిధిలో పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. వైసీపీ పాలనలో పోలీసుల అత్యుత్సాహం కారణంగానే వైఎస్ జగన్ ఓటమి పాలయ్యారని అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టడం సహించరానిదని అన్నారు. సీపీఐ దీన్ని ఖండిస్తోందని అన్నారు. అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిపై పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని డీజీపీని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుకుంటే ఈ తరహా పోస్టులను కట్టడి చేయలేరా అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ఇరుపార్టీల నేతలు ఆలోచించుకోవాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్ గురించి ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చెబుతున్న విషయాలకీ, ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఏ మాత్రం పొంతన లేదని అన్నారు. అప్పుల నుంచి రాష్ట్రాన్ని ఏ విధంగా గట్టెక్కిస్తారనే అనుమానం కలుగుతోందని అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు కరెంటు చార్జీలను పెంచమని చెప్పారని, కానీ అధికారంలోకి వచ్చిన తరువాత కరెంటు బిల్లులు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అన్నారు. ఇదే జరిగితే కరెంటు బిల్లులు తగ్గించేంత వరకూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలుపుతామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కరెంటు బిల్లులను పెంచే ఆలోచనను విరమించుకోవాలనే డిమాండ్‌తో ఈనెల 19న విజయవాడలో భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

నేటి నుంచి సహకార వారోత్సవాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 71వ అఖిలభారత వారోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారులు అనంతపురం అరుణకుమారి, శ్రీసత్యసాయి జిల్లా కృష్ణానాయక్ తెలిపారు. 14న సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడం, సహకార మంత్రిత్వ శాఖ కొత్త కార్యక్రమాలు, 15న సహకార సంస్థల్లో ఇన్నోవేషన్, టెక్నాలజీ, గుడ్ గవర్నెన్స్, 16న వ్యవస్థాపక పెంపు-ఉపాధి-నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడంలో సహకార సంస్థల పాత్ర, 17న సహకార సంస్థల రూపాంతరం, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం, 19న మహిళలు-యువత-బలహీన వర్గాల కోసం సొసైటీలు, 20న మెరుగైన ప్రపంచం కోసం ముందుకు వెళ్లడంలో సహకార సంస్థల పాత్ర అనే అంశాలపై సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని సహకార బ్యాంకులు, సహకార సొసైటీలు, సహకార సంస్థలు, ఆయా పాలకవర్గాల సభ్యులు, సహకార శాఖ అధికారులు, శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొని 71వ సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్తం

పాండురంగస్వామి నిజపాద దర్శనం

అనంతపురం కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం రామ్ నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద దర్శనం కార్యక్ర మాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూల విరాట్లకు ఫలపంచామృతాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

15న సత్యనారాయణస్వామి కల్యాణం



గార్లదిన్నె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కనుంపల్లి సమీపంలో వెలసిన సత్య నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 15న సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బుల్లే మురళి తెలిపారు. ఏటా కార్తీక మాసంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 15న పౌర్ణమి రోజు ఉదయం నిర్వహించే స్వామి కల్యాణోత్సవానికి గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

15న ప్రాంగణ నియామకాలు

అనంతపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేటలో ఉన్న బాలాజీ పీజీ(ఎంబీఏ) కళాశాలలో ఈనెల 15వ తేదీన ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు బహుళజాతీయ కంపెనీలు పాల్గొనున్నట్లు తెలిపారు. డిగ్రీ, ఎంబీఏ కోర్సు పూర్తి చేసిన వారు, చదువుతున్న వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు బెంగుళూరు కేంద్రంగా పనిచే యాల్సి ఉంటుందన్నారు. వార్షిక వేతనం రూ.2.50లక్షలు ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాలలో ఉదయం 10గంటలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

గ్రామాభివృద్ధిపై శిక్షణ

నార్పల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవా రం గ్రామాభివృద్ధి ప్రణాళికపై మండలం లోని అన్ని శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఎంపీడీఓ గంగావతి మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ శైలజా రాణి, శిక్షకుడు శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

రామగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరూరులో శంకర కంటి ఆస్పత్రి, బెంగళూరు ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కోడి రామమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు, ఫొటోలు తీసుకురావాలన్నారు. పేరూరులోని బస్టాండ్ సమీపంలోని పెద్దమ్మగుడి వద్ద వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

18న కనకదాస జయంతి

బుక్కరాయసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 18న నిర్వహించే కనకదాస జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజినేయులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో ఉత్సవాల వాల్‌పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. కనకదాస జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీ యమన్నారు. ఈ సమావేశంలో కురబ్బల ఐక్యత, ప్రభుత్వం అమలు చేయాల్సిన సంక్షేమ పథకాల గురించి చర్చిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శి ఆవుల క్రిష్ణయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, అక్కులప్ప, వీరనారప్ప పాల్గొన్నారు.

మూడు నెలల జైలు శిక్ష

అనంతపురం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో నిందితుడికి మూడునెలల జైలుశిక్ష పడింది. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురానికి చెందిన గుజ్జల రామకృష్ణపై అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మూడు చోరీ కేసులు నమోదయ్యాయి. అప్పటి సీఐ క్రాంతికుమార్ విచారణ చేసి చార్జిషీట్ వేశారు. మంగళవారం అనంతపురం ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

పీడీకి సన్మానం



పీడీని సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రామగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడంతో ఆ పాఠశాల పీడీ అజయ్‌బాబును మంగళవారం సన్మానించారు. జాతీయస్థాయి హాకీ పోటీలకు ఆ పాఠశాల విద్యార్థి సాత్విక్, వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థిని అలేఖ్య ఎంపికయ్యారు. దీంతో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య పాఠశాల హెచ్‌ఎం అనంతపద్మనాభం, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి పీడీని సన్మానించారు.

సంస్కృతి.. సంప్రదాయాలకు ప్రతిబింబాలు ఆలయాలు

● అద్వైతానంద భారతీస్వామి

అనంతపురం కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు ఆలయాలు అని అవని శృంగేరి జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం స్వామీజీ అద్వైతానంద భారతి అన్నారు. శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, పాతూరులోని దత్తమందిరాలను మంగళవారం ఆయన సందర్శించారు. భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. దురహంకారమనే సముద్రంలో కొట్టుకుపోతున్న జీవులను కాపాడేందుకు భగవంతుడు వేదం అనే నావను సృష్టించారని అన్నారు. మనలోని శ్రద్ధ, భక్తిప్రపత్తులకు మూలకేంద్రాలు ఆలయాలని, తోటివారందరినీ కలుపుకుని కులమతాలు, రాజకీయాలకు అతీతంగా దేవాలయ వ్యవస్థను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాశీవిశ్వేశ్వ రాలయం ఈఓ సాకే రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, శంకరమఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, అప్పా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



కాశీవిశ్వేశ్వరాలయాన్ని సందర్శిస్తున్న భారతీస్వామి

ఘనంగా గో వృషభ కల్యాణం

అనంతపురం కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సాయి ట్రస్టు ఆధ్వర్యంలో హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో మంగళవారం గోవృషభ, తులసీ దామోదర కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, విశ్రాంత న్యాయ మూర్తి సుబ్రహ్మణ్యకుమార్, ఆదినారాయణ, వలీస్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు చిట్టా శ్రీధర్, జయచంద్రరెడ్డి, విజయకుమార్, సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణ నాయక్, రాము, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి పరకలూ కరువే..!

● అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ
● కార్మికుల పరిస్థితి దయనీయం
● పనిముట్ల నుంచి కొబ్బరినూనె వరకు ఎగవేతలే



పుష్‌కార్టులు లేకపోవడంతో సంచుల్లో చెత్తను తీసుకెళ్తున్న కార్మికుడు

అనంతపురం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం నగరంలో పారిశుధ్య కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రమాదకర పను లు చేస్తున్న కార్మికులకు కనీస పనిముట్లు కరువ య్యాయి. దీంతో సరిగా మురుగు కాలువలు శుభ్రం చేయలేని దౌర్భాగ్య పరిస్థితి వారిది. చెత్త ఎత్తివేయడా నికి పరికరాలు లేక ప్లాస్టిక్ సంచులు వాడుతున్నారు. సమయానికి పరకలు అందజేయకపోతే వారే కొత్త పరకలు కొంటున్నారు. గత కొన్నేళ్లుగా నగర పాలిక పరిధిలో పారిశుధ్య కార్మికులకు పూర్తి స్థాయిలో ఏనాడూ పరికరాలను పంపిణీ చేయలేదు. అధికారు లు మాత్రం ఆ నిధులను నిధులను పక్కదారి పట్టిం చి, కొన్నింటిని మాత్రమే కార్మికులకు అందజేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రతి ఏటా ఈ దోపిడీ పర్వం కొనసాగుతూనే ఉంది. ఇక అధికారుల నిర్లక్ష్యంతో నగరంలో పారిశుధ్యం మరింత అధ్వానంగా మారింది. పనిచేసేవారి కంటే పర్యవేక్షించే వారే ఎక్కువయ్యారు.



కాలువల్లో చేతులతోనే పనులు

పరకలెక్కడ..?

నగరపాలికలో పారిశుధ్య విభాగంలో 409 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు, 135 మంది రెగ్యులర్ కార్మికు లు పనిచేస్తున్నారు. అందులో మహిళా కార్మికులకు తప్పనిసరిగా ప్రతి మూడు నెలలకోసారి ఒక్కొక్కరికి పది కట్టలు(4 పరకలు) ఇవ్వాలి. కానీ గత కొన్నేళ్లుగా వాటిని ఏనాడు సరిగా పంపిణీ చేయలేదు. నాలుగు నెలల క్రితం కొన్ని సర్కిళ్లలో ఒక్కొక్కరికి రెండు కట్ట లు, మూడు, ఐదు కట్టల చొప్పున పంపిణీ చేశారు. అంతకుముందు గత ఏడాది ఇచ్చారని కార్మిక సంఘా ల నాయకులు చెబుతున్నారు. మహిళలకే చెత్త ఎత్త డానికి రెండు రేకులు, టబ్బులు ఇవ్వక ఎన్ని ఏళ్ల యిందో తెలియడం లేదని కార్మికులు వాపోతున్నారు. గాజు పదార్థాలు ఎత్తే సమయంలో ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఏ కార్మికుడి చేతిలోనూ గ్లౌజులు కనిపించవు. పుష్‌కార్టులకు ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తు పట్టడానికి(తెల్లవారుజాము సమ యంలో) ఆప్రాన్‌లు రెండు ఇవ్వాలి. కానీ అవి ఎక్కడా లేవు. మగవాళ్లకైతే మూడు నెలకోసారి రెండు పారలు, రెండు కడ్డీలు, ఒక గడ్డపారు, కాలువ బండి అందజేయాల్సి ఉంటుంది. అవేవీ లేవు. కాలువలు తీసే సమయంలో చేతికి గ్లౌజులు, కాళ్లకు మెత్తటి బూట్లు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో దారుణం ఏంటంటే దాదాపు రెండేళ్ల క్రితం నగరంలో వరదలు వచ్చిన సమయం లో దుకాణాల్లో కొనుగోలు చేసి తీసుకొచ్చి, మళ్లీ వెన క్కు ఇచ్చేశారట. ఇక 2019 లో దాదాపు 150 వరకు పుష్‌కార్టులు ఇవ్వగా అందు లో కార్మికులకు 100 ఇచ్చి నట్లు కార్మికులు చెబుతున్నా రు. అవి మరమ్మతులకు గురై ప్రస్తుతం పనికిరాకుండా పోయాయి. ఏడాదిగా వాటి గురించి అతీగతీ లేకుండా పోయింది.

ఏటా రూ.10లక్షల పైమాటే...

పనిముట్లు, పరికరాలు, పరకల విషయంలో కార్మికులకు ఇవ్వకుండా అధికారులు ధులు కాజేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి వ్యవహారం నడుపుతున్నట్లు సమాచారం. వాటిని ఇవ్వకుండానే ఇచ్చినట్లు బిల్లులు చేసుకోవడం, నిధులు మళ్లిస్తూ వచ్చారు. ఇలా ఏటా రూ.10లక్షల పైమాటే స్వాహా చేస్తున్నట్లు సమాచారం. ఇది వరకు కమిషనర్‌గా పనిచేసిన మేఘస్వరూప్ ఉన్న సమయంలో తన చాంబర్‌లో మున్సిపల్ యూనియన్ నాయకులతో, సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.5లక్షల నిధులతో పనిముట్లు, పరకలు అందజేయాలని ఆదేశించారని, కానీ అది రూ.60వేలకే పరిమితమైందని పలువురు కార్మికులు అంటున్నారు. ఈ విషయం ప్రస్తుత ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తికి తెలిసే ఉంటుందని సమాచారం.

ఎన్నాళ్లు అడగాలి..?

పరకల నుంచి పుష్‌కార్టుల వరకు పారిశుధ్య కార్మికులకు ఏవీ సరిగా లేవు. గ్లౌజులు లేకుండానే గాజుముక్కలు వంటి వాటిని తీయాలి. ఎంత మంది అధికారులు మారినా కార్మికుల సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రతి సోమవారం స్పందనలో ఎన్ని వినతులు ఇచ్చినా అదే పరిస్థితి. కార్మికులు చనిపోతున్నా పట్టించుకునేవారు లేరు.

\- నాగభూషణం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు

ఆర్థిక విధ్వంసం నుంచి కోలుకునే బడ్జెట్

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం నుంచి కోలుకునే విధంగా తొలి రాష్ట్ర బడ్జెట్ ఉందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓ వైపు సంక్షేమానికి పెద్ద పీట వేస్తూనే.. మరోవైపు అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారన్నారు. అనేక సవాళ్లు, ఆటుపోట్ల మధ్య ప్రయాణం సాగించాల్సిన సమయంలో బడ్జెట్ కూర్పు చాలా అద్భుతంగా ఉందన్నారు. రూ.2.94 లక్షల కోట్లతో ఆయా రంగాలకు ప్రాధాన్యం మేరకు సమతూకం వేసినట్లుగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట

● గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్



అనంతపురం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ పేర్కొన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తొలి బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రూ.4376 కోట్లు కేటాయించడం శుభపరిణామమన్నారు. ముస్లిం మైనార్టీల తరపున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ హయాంలో హామీల పేరుతో ముస్లిం మైనార్టీలను దగా చేశారని మండిపడ్డారు.

క్రైస్తవుల పక్షపాతి సీఎం చంద్రబాబు

● టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్



అనంతపురం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవుల పక్షపాతి సీఎం చంద్రబాబు అని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ పేర్కొన్నారు. టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర తొలి బడ్జెట్‌లో క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కోసం రూ.151 కోట్లు కేటాయించడం గర్వకారణమన్నారు. గత వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి క్రిస్టియన్ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశాడని దుయ్యబట్టారు.

బడ్జెట్‌లో పంచాయతీరాజ్‌కు అగ్ర తాంబూలం

● దేగల కృష్ణమూర్తి, గోనుగుంట్ల భూషణ్

అనంతపురం అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర తొలి బడ్జెట్‌లో పంచాయతీరాజ్‌కు అగ్ర తాంబూలం ఇచ్చారని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి, ఉమ్మడి అనంత జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదేళ్లల్లో కుంటుపడిన గ్రామీణాభివృ ద్ధిని పునరుద్ధరించేందుకు భారీగా నిధులు కేటాయించడం హర్షణీయ మన్నారు. ఇప్పటికే పల్లె పండుగలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సమకూరుస్తున్నారన్నారు. బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చిన సీఎం చంద్రబాబు, పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రులు నారాలోకేశ్, పయ్యావుల కేశవ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆవుల క్రిష్ణయ్య



గార్లదిన్నె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా మండలపరిధి లోని మర్తాడు గ్రామానికి చెందిన ఆవుల క్రిష్ణయ్యను నియమించారు. ఆయన టీడీపీ నుం చి ఇప్పటి వరకు పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. 2006 జరిగిన స్థానిక ఎన్నికల్లో వైస్ ఎంపీపీగా విజయం సాధించారు. ప్రస్తుతం టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడగా పనిచేస్తు న్నారు. ఆయన పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆవుల క్రిష్ణయ్య మాట్లాడుతూ... ఊహం తెలిసినప్పటి నుంచి టీడీపీలోనే పనిచేశాన్నారు. పార్టీ అభ్యున్నతికి మరింత కృషి చేస్తానన్నారు. ఆయనను కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఎంపిక చేయడంతో కురుబ సంఘం వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూల నాగరాజుకు సన్మానం



అనంతపురం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా ఎంపికైన మాజీ జడ్పీ చైర్మన్ పూల నాగరాజును పలువురు టీడీపీ నాయకులు సన్మా నించారు. అమరావతిలోని ఏపీ సచివాలయంలో టీడీపీ బీసీ సెల్ నాయకులు సిమెంట్ పోలన్న, పుట్టపర్తి వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జరిపిటి కృష్ణమూర్తి, నాయకులు రమేష్‌బాబు, వడ్డే పుల్లన్న మంగళవారం ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

లెదర్ పరిశ్రమను తెరిపించండి: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



మాణిక్యాలరావును కలిసిన ఎమ్మెల్యే

శింగనమల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రాచేపల్లి మినీ లెదర్ పరిశ్రమను తెరిపించాలని ఏపీ లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. ఎమ్మెల్యే బుధవారం విజయవాడలో లీడ్ క్యాప్ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా రాచేపల్లి మినీ లెదర్ పరిశ్రమ మూతపడిందని దానిని పునఃప్రారంభించాలన్నారు. దీంతో యవతకు ఉపాధి అవకాశాలు వస్తాయని అయన దృష్టికి తీసుకెళ్లారు. అయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చంద్రబాబుతోనే బడుగుల అభివృద్ధి



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతి నిధి లక్ష్మీనరసింహ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎస్సీఎస్టీ సంక్షేమశాఖ కార్యాల యాల ఆవరణంలో థాంక్యూ సీబీఎన్ సార్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి ఆయన ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.

మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలి : ఎస్ఈ

అనంతపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సపంత్ కుమార్ సూచించారు. ఆయన మంగళవారం డివిజన్ ఈఈ జేవీ రమేష్‌తో కలసి స్థానిక జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో అనంతపురం డివిజన్‌లోని డీఈఈలు, ఏఈఈలు తదితరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ... లో ఓల్టేజీ సమస్య పరిష్కరం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని సూ చించారు. ప్రాధాన్యం బట్టి వ్యవసాయ కనెక్షన్ల మంజూరుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈఈటీ ప్రసాద్, ఎస్ఏఓ బాలాజీ వెంకటేష్‌తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ-ఏ జట్టు భారీ స్కోరు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ఏసీఏ-ఏ జట్టు భారీ స్కోర్ చేసింది. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో రెండో దశ జిల్లా స్థాయి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-16 క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఏసీఏ ఏ- ఏసీఏ డి జట్ల మధ్య పోటీ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ-ఏ జట్టు 110ఓవర్లలో 464పరుగులకు 7వికెట్లు కోల్పోయి డిక్లేర్ చేసింది. ఇందులో హర్షసాయి సాత్విక్ 118, సుమేధ్ భరద్వాజ్ 100పరుగులు చేశారు. డి జట్టు 34.3ఓవర్లలో 117పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఏ జట్టు 451పరుగుల ఆధిక్యంలో ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో ఎ జట్టు 22ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 104పరుగులు చేసింది. మరో మ్యాచ్‌లో టీం సి -టీం బి జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన టీం-బి జట్టు 89.4ఓవర్లలో 209పరుగులకు ఆలౌట్ అయ్యింది. టీం సీ బౌలర్ గౌతమ్ ఆర్య 5వి కెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన టీం సీ జట్టు 34.1 ఓవర్లలో 76పరుగులకే కుప్పకూలింది. టీం బీ బౌలర్ మహిత్ 5వికెట్లు తీశాడు. రెండో ఇన్నింగ్స్‌లో టీం బి జట్టు 52ఓవర్లలో 192పరుగులు చేసి 9వికెట్లు కోల్పోయింది. టీం సి బౌలర్ గౌతమ్‌ఆర్య 5వికెట్లు తీశాడు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికె ట్ సంఘం ఇంచార్జి సెక్రటరీ భీమలింగా రెడ్డి, ఏసీఏ సెలెక్షన్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సెలెక్టర్ నాగార్జున, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారిపై ఫిర్యాదు

అనంతపురంటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యశాఖాధికారి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఉరవకొండ సబ్‌యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టరు వినోద్ కుమార్‌ను కలిసి, జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సమగ్రవిచారణ జరపాలని కలెక్టరుకు వినతి రూపంలో ఫిర్యాదు చేసినట్లు కోదండరామిరెడ్డి తెలిపారు.

బడికి వలస కుటుంబాల పిల్లలు

అనంతపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా బాల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవా రం ఐసీడీ ఎస్ పీడీ శ్రీదేవి తదితరులు మండలంలో ని రాచానపల్లి వద్ద అక్కదేవతల గుడి సమీపంలో ఉంటున్న వలస కుటుంబాలను పరిశీలించారు. ఆ కుటుంబాలతో మాట్లాడారు. పీడీ మాట్లాడుతూ... కల్లూరు, ఉరవకొండ, కంబదూరు ప్రాంతాల నుంచి వివిధ కా రణాలతో వలస వచ్చిన పలు కుటుంబాలు ఇక్కడే గుడారాలు ఏర్పరుచుకుని ఉంటున్నారన్నారు. ఆ కుటుంబాలకు చెందిన మొత్తం 34మంది పిల్లల్లో 13మందిని అంగన్‌వాడీ కేంద్రంలో, 21మంది పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్చామని తెలిపారు.

డీఎస్‌డీఓపై పోలీసులకు ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వన్‌టౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్/అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీఓ) షఫీపై టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన 'ఏం చేస్తే స్పందిస్తారో' అనే కథనానికి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచనల మేరకు మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంగళవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజేంద్రయాదవ్‌ను కలిసి రాతపూర్వకంగా పిర్యాదు అందజేశారు. అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో జనరేటర్, క్రీడాసామాగ్రి అమ్ముకున్న విషయాన్ని పిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేంద్రయాదవ్ తెలిపారు. పోలీసులు డీఎస్‌డీఓ షఫీని స్టేషన్‌కు పిలిపించి ప్రాథమిక విచారణ చేసి సంతకాలు చేయించుకుని పంపివేశారు. విచారణకు సహకరించాలని సూచించారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నాయకులు కృష్ణకుమార్, మున్వర్, మణికంఠ బాబు, డిష్ ప్రకాష్, సరిపూటి శ్రీకాంత్ ఉన్నారు.

కలెక్టర్ ఆరా: మరోవైపు జనరేటర్, క్రీడాసామాగ్రి మాయం, నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆరా తీశారు. జనరేటర్, క్రీడా సామాగ్రి అమ్ముకోవడ ం పట్ల డీఎస్‌డీఓపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం: శాప్ చైర్మన్

జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో పరిణామాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఏపీ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు స్పందించారు. డీఎస్ఏలో జనరేటర్, క్రీడా సామాగ్రి అమ్ముకోవడం, నిధుల దుర్వినియోగం పట్ల డీఎస్‌డీఓ షఫీపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో ఎక్కడా పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపడుతామన్నారు. ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేశామని....వివరణ, విచారణ అనంతరం చర్యలు ఉంటాయని తెలిపారు.

పట్టా భూములను తారుమారు చేస్తారా..?

● అధికారులను నిలదీసిన రైతులు

కనగానపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టా భూములను వేరొకరికి ఎలా మారుస్తారని మండలం లోని ముక్తాపురం గ్రామస్థులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మంగళ వారం ముక్తాపురం గ్రామంలో తహసీల్దార్ జీవి ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్తాపురానికి చెందిన రైతులు లింగ మయ్య, చంద్రశేఖర్,పుల్లన్న మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేస్తున్న భూమికి మరికొందరి పేర్లమీద ఆన్‌లైన్ ఎలా చేస్తారని వీఆర్వో వీఆర్వో చెన్నకేశవులు ను నిలదీశారు. అధికారులు సమాధానమిస్తూ విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అక్కడే ఉన్న రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు నెట్టెం వెంకటేశ్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య రైతులకు సర్దిచెప్పి శాంతింపజేశారు.

● చెన్నేకొత్తపల్లి: మండలంలోని ముష్టికోవెల గ్రామంలో మంగళవారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో పలువురు రైతులు భూముల సమస్యల పరిష్కారం కోసం పలు వినతులు అందజేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు : డీఎస్పీ

శింగనమల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఎక్కడైనా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు హెచ్చరించారు. మండలంలోని తరిమెల పెన్నానది ప్రాంతాల్లో కొందరు అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో డీఎస్పీ ఆ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. మండలంలో వంక ప్రాంతాలు, పెన్నానదిలో కొందరు ఇసుకను పెద్ద వాహనాల్లో తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే అప్రాంతాలో పోలీస్ గస్తీ ఏర్పాటు చేశామని, ఎవరైనా అతిక్రమించి ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

ఉపాధిలో భారీగా అక్రమాలు

● గుర్తించిన సామాజిక తనిఖీ బృందం ● రూ.4 లక్షల రికవరీకి ఆదేశం ● సిబ్బంది నిర్లక్ష్యంపై పీడీ ఆగ్రహం

శెట్టూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. సామాజిక తనిఖీ బృందం చేపట్టిన తనిఖీల్లో అక్రమాలు వెలుగు చూశాయి. మండల వ్యాప్తంగా సంవత్సర కాలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణంలో సామాజిక తనిఖీ బృందం ప్రజావేదిక ద్వారా ఆడిట్ వివరాలను వెల్లడించింది. సమావేశానికి డ్వామా పీడీ సలీమ్ బాషా, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఉపాధి హామీ సిబ్బంది నుంచి రూ. 4,40,640 రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి రూ. 22,32,500 జరిమానా విధించారు. ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ లోపంతోనే అధికంగా నిధులు దుర్వినియోగమైనట్లు బహిర్గతం చేశారు. ఉపాధి పనుల వద్ద ఆయా గ్రామాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయలేదని జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులకు సంబంధించిన రికార్డులు కూడా సక్రమంగా నిర్వహించకపోవడం సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు చేపడతామని పీడీ హెచ్చరించారు. కనుకూరు పంచాయతీలో సుమారు రూ. 20 లక్షలకు పైగా అక్రమాలు జరిగాయని సామాజిక బృందం గుర్తించింది. రూ. 13 లక్షలకు సంబంధించిన పనులు వివరాలను ఉపాధి సిబ్బంది చూపించలేదు. చాలా గ్రామాల్లో డ్రైలాండ్ హార్టికల్చర్ కింద మొక్కలు లేకపోయినా బిల్లులు మంజూరు చేయడం పట్ల అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురామారావు, ఏపీఎం నీరజ, ఈసీ రమణ, ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ, సామాజిక బృందం పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ వివరాలు తెలుసుకుంటున్న పీడీ సలీమ్ బాషా

రైల్వే కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై పోరాడుతాం

గుంతకల్లు/గుత్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులు, కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తామని ఎన్ఎఫ్ఐఆర్, ఎంప్లాయిస్ సంఘ్ జాతీయ కార్యదర్శి మర్రి రాఘవయ్య పేర్కొన్నారు. రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం డీఆర్ఎం కార్యాలయం బయట లంచ్ అవర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాఘవయ్య మాట్లాడుతూ ఏఐఆర్ఎఫ్ నిర్వాకం వల్ల నూతన పింఛను విధానం అమలులోకి వచ్చిందని ఆరోపించారు. దాదాపు 20 ఏళ్ల నుంచి ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సి వచ్చిందన్నారు. కార్మికుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పాటుపడే ఎంప్లాయిస్ సంఘ్‌కు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐఆర్, ఎంప్లాయిస్ సంఘ్ జాతీయ సంయుక్త కార్యదర్శి భరణి భాను ప్రసాద్, సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు. గుత్తిలో మర్రి రాఘవయ్యకు కార్మికులు, ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుత్తిఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డు నుంచి సంఘ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో కార్మికుల కోసం కృషి చేస్తున్న సంఘ్‌కు రైల్ ఇంజన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ్ నాయకులు బాబు, సుభాష్, రాజశేఖర్‌రెడ్డి, కుళ్లాయప్ప, సుధాకర్, నారాయణ, కృష్ణామోహన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాఘవయ్య

ట్రాక్టర్ ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



బొమ్మనహాళ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌కు మొక్కజొన్న సొప్ప వేసే క్రమంలో ఢీకొని మాజీ సర్పంచ్ పార్వతి (40) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. మండలంలోని గోవిందవాడ గ్రామంలో పొలంలో ట్రాక్టరుకు మొక్కజొన్న సొప్ప వేస్తున్న సమయంలో రివర్స్ రావడంతో ఢీకొని ఆమె మృతి చెందారు. గ్రామానికి చెందిన సిద్దలింగ మండలంలోని తర్కాపురం గ్రామానికి చెందిన పార్వతిని 22 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. గ్రామానికి సమీపంలోని తనకు ఉన్న మూడు ఎకరాల భూమి సాగు చేసుకుంటు అక్కడే ఒక గుడిసె వేసుకుని కాపురం ఉంటున్నారు. వారి పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను కూలీలతో కలిసి నూర్పిడి చేశారు. పశువులకు అవసరమైన సొప్పను ట్రాక్టర్‌లో వేస్తున్న సమయంలో పార్వతి వెనక ఉన్నట్లు గమనించకుండా సిద్దలింగ రివర్స్ చేశాడు. దీంతో పార్వతి ట్రాక్టర్ కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఎస్ఐ నబీరసూల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మాజీ సర్పంచ్ పార్వతి మృతిపై రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నిమోనియాపై అవగాహన ర్యాలీ

బొమ్మనహాళ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ నిమోనియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యూమోనియా వ్యాధి ఎలా వస్తుంది అనే విషయంపై హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు శశికళదేవి, రామాదేవి, గోవర్ధన్, అంగన్వాడి కార్యకర్తల్తు కృష్ణవేణి, లక్ష్మి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెద్దవడుగూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టిపాడు గ్రామంలోని నరసింహ అనే వ్యక్తిపై ఇదే గ్రామానికి చెందిన చిన్నఓబులేసు, పెద్ద ఓబులేసుతోపాటు మరో నలుగురు దాడిచేయడంతో తలకు తీవ్రంగా గాయమైంది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

నాయీబ్రాహ్మణుల నిరసన

గుత్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ జాతిని కించపరిచే విధంగా మాట్లాడిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ సర్కిల్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ కడప జిల్లాలో జిలాన్ అనే వ్యక్తి ఓ ప్రెస్‌మీట్‌లో నాయీబ్రాహ్మణుల కులజాతిని అవమానపరిచే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ మనోభావాలను దెబ్బతీసేవిధంగా మాట్లాడిన సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీ సర్కిల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వచ్చి సీఐ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజనేయులు, నారాయణస్వామి, రంగనాయకులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయీబ్రాహ్మణులు

రుక్మిణీ పాండురంగస్వామికి విశేష పూజలు

బొమ్మనహాళ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామంలో వెలసిన రుక్మిణీ పాండురంగ స్వామికి మంగవారం ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతభిషేకం, అష్టోతర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది వచ్చి స్వామి వారిని దర్శించుకుని తులసి మాలలు ధరించారు.


పుష్పాలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

క్లుప్తంగా..

వైసీపీ మండల కన్వీనర్ రాజీనామా

కణేకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్ ఆలూరు తిక్కన్న మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి కన్వీనర్‌గా ఉంటున్న తనకు ఆరోగ్యం సహకరించకపోడంతో పదవికి రాజీనామా చేశానని, పార్టీలో కొనసాగుతానని ఆయన పేర్కొన్నారు.

రాకెట్ల పీహెచ్‌సీ తనిఖీ

ఉరవకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి ఓబులు మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పావని, ఏఎంవో సత్యనారాయణ, సబ్‌యూనిట్ అధికారి గిరిధర్ రెడ్డి, సీహెచ్‌వో నాగరంగయ్య సిబ్బంది పాల్గొన్నారు.

కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నీలాస్వామి



కళ్యాణదుర్గం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లికి చెందిన నీలాస్వామిని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంగళవారం ప్రభుత్వం నియమించింది. నీలాస్వామి కళ్యాణదుర్గం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేస్తూ టీడీపీ అభివృద్ధికి కృషి చేశారు. వార్డు మెంబర్‌గాను సేవలు అందించారు. దీంతో చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నీలాస్వామి సేవలను గుర్తించి రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు.

ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం

ఉరవకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి ఎస్సీ కాలనీలోని కొల్హాపురమ్మ ఆలయ జీర్ణోద్ధారణకు ఎస్ఆర్ఐ విరాళాన్ని అందజేశారు. అమెరికాలోని డల్లాస్ ప్రాంతంలో నున్న గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ వారిని మాజీ సర్పంచ్ చిరంజీవి సంప్రదించారు. ఈ మేరకు ఆ సంస్థ తరపున అంజనేయులు, నాగమణి ఆలయ పైకప్పు నిర్మాణానికి రూ.2లక్షలు విరాళం అందించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు : సీఐ

గుంతకల్లుటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదవాలని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని గుంతకల్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపారు. పట్టణంలోని సరోజినీ నాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో వివిధ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ద్వేవాలయం ఈఓ వాణి మాట్లాడుతూ విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. అనంతరం పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ దామోదర్, జేవీవీ నాయకులు చంద్రశేఖర్, చిట్టిబాబు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

గుంతకల్లుటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు మంగళవారం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ అనంతపురంలో ఎన్‌సీసీ 6వ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో తమ కళాశాలకు చెందిన 19 మంది పాల్గొన్నారని తెలిపారు. శిక్షణలో ఎన్‌సీసీ కార్యకలాపాలు, నాయకత్వ లక్షణాలపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షించిన తరువాత రాత పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన 19 మంది విద్యార్థులకు బి సర్టిఫికెట్లను అందజేశారన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

తాడిపత్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యల్లనూరు రోడ్డులో మంగళవారం అక్కన్నపల్లికి చెందిన లోకేష్, చుక్కలూరుకు చెందిన రవి పాతకక్షల కారణంగా ఘర్షణ పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాతకక్షల కారణంగా ఒకరికొకరు తటస్తపడడంతో మాటమాట పెరిగి కొట్టుకున్నారు. వీరిలో రవికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

విద్యార్థుల ఘర్షణ

తాడిపత్రి పట్టణంలోని యల్లనూరురోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థులు మంగళవారం తాగునీటి విషయంలో గొడవపడ్డారు. అంతటితో ఆగకుండా వారి బంధువులను ఫోన్‌ద్వారా పిలిపించుకొని ఒకరిపై ఒకరు దాడిచేసుకొని గాయపడ్డారు.

రేపు భారీ ర్యాలీ

గుత్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జనసేన నాయకుడు టీసీ వరుణ్‌కు అహుడా చైర్మన్ పదివి కేటాయించడం హర్షణీయమని జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యుడు వాసిగిరి మణికంఠ పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 14న అనంతపురం వస్తున్న సందర్భంగా బాటసుంకలమ్మ దేవాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

కనకదాస జయంతిని విజయవంతం చేయండి

కణేకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 18న జరిగే కనకదాస జయంతిని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా కనకదాస జయంతిని నిర్వహిస్తున్నందున ఉమ్మడి జిల్లాలోని కురుబలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఈ మేరకు మంగళవారం కణేకల్లులో ఆయన కనకదాసు జయంతి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే మల్లికార్జున, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, నాయకులు కృష్ణమూర్తి, వసికేరి శివ, తిక్కన్న, తిప్పేస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్ : భక్తకనకదాసు చూపిన మార్గమే కురుబలకు ఆదర్శనీయమని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని కురుబ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కురుబ కులస్తుల ఐక్యత చాటుతూ రాబోయే తరాలకు భక్త కనకదాసు జీవితం గురించి తెలియజేయాలన్నారు.

పశుగ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం సాగు కోసం దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం పశువైద్యాధికారి సువర్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ రైతులు 10 నుంచి 50 సెంట్లలోపు గడ్డిని సాగు చేసుకొనేందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని తెలిపారు. 50 సెంట్లకు రూ.32,992, 40 సెంట్లకు రూ.26,394, 30 సెంట్లకు రూ.19,795, 20 సెంట్లకు రూ.13,197, 10 సెంట్లకు రూ.6,599 ఇస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు జాబ్‌కార్డు, వన్‌బీ, ఆధార్, బ్యాంక్ ఖాతా, రేషన్ కార్డులు తెచ్చుకోవాలని సూచించారు.

గ్యాస్ లీకై మహిళకు తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామంలో బాలనాగమ్మ అనే మహిళకు గ్యాస్‌లీకై మంటలు వ్యాపించడంతో తీవ్రంగా గాయపడింది. మంగళవారం తెల్లవారుజామున గ్యాస్‌స్టవ్ ఆన్‌చేసి ఆఫ్ చేయడం మరిచిపోయి బయటకు వెళ్లడం జరిగింది. నివాసగృహంలోకి ప్రవేశించి లైట్‌వేయడంతో ఒక్కసారిగా భారీశబ్దంతో మంటలు వ్యాపించడంతో మహిళ తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా శ్రీనివాసరాజు

గుంతకల్లుటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన బి. శ్రీనివాసరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం మంగళవారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు. తనను గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, ఉపాధ్యక్షుడు వెంకటయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

విడపనకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జోరుగా సాగింది. మండల నాయకులు పాపారాయుడు, జయరాం అధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వాన్ని నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం చేయించుకోవటం వల్ల కార్యకర్తలకు అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, ఎర్రిస్వామి, రంగస్వామి, లక్ష్మీపతి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

టమోటాకు బీమా వర్తింపు

తాడిపత్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగుచేసిన టమోటా పంటకు బీమా వర్తింపజేసినట్లు మండల ఉద్యానవనశాఖ అధికారి ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15దాకా సాగుచేసే పంటకు వాతావరణ పరిస్థితు టల వల్ల నష్టం జరిగితే బీమా అందుతుందని తెలిపారు. ఎకరా పంటకు రూ.1600 ప్రీమియం చెల్లించాలన్నారు. నష్టం జరిగిన సమయంలో రూ.32వేలు పొందవచ్చునని తెలిపారు.

చెర్లోపల్లిలో పంటకోత ప్రయోగాలు

పుట్లూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లిలో మంగళవారం పత్తిపంట కోత ప్రయోగాలు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి కాత్యాయిని తెలిపారు. రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి పొలాల్లో పంటకోత ప్రయోగాలు చేయగా 1.050, 1.200 గ్రాముల దిగుబడి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో లాభాలు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు పొందవచ్చని ఎకాలజీ సంస్థ సభ్యుడు భాస్కర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని బోరంపల్లి గ్రామ సస్యమిత్ర సహకార సభ్యుల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్దతులతో చిరుధాన్యాలు సాగుపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. వ్యవసాయంలో రసాయనిక పద్ధతులలో ఎదురవుతున్న సమస్యలను రైతులకు వివరించారు. రసాయనిక పద్దతిలో వ్యవసాయంలో అధిక పెట్టుబడులు, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, ఎకాలజీ సంస్థ సభ్యులు వీరభద్రారెడ్డి, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

యాడికి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మహిళలకు చట్టాలపై అవగాహన చాలా అవసరమని న్యాయవాది కొండయ్య తెలిపారు. మంగళవారం యాడికిలోని సమావేశ భవనంలో మహిళా న్యాయసేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. బాల్యవివాహాలు, లైంగిక వేధింపుల పరంపర కొనసాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో చట్టాలపై మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వివరించారు. నిర్భయ, దిశ, పోక్సో, ఉమెన్ హెల్ప్‌లైన్, చైల్డ్‌హెల్ప్‌లైన్‌పై అవగాహన కల్పించారు. ఏదైనా న్యాయ సహాయం కావాల్సి వస్తే తమను సంప్రదించవచ్చునని తెలిపారు. సదస్సులో ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగం, న్యాయవాది శివరాంకృష్ణ, ఎంపీడీఓ వీరరాజు, సీఐ ఈరన్న, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బొమ్మనహాళ్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు హెచ్చరించారు. మంగళవారం బొమ్మనహాళ్ పోలీసుస్టేషన్‌ను ఆయన తనీఖీ చేసారు. పోలీస్ స్టేషన్ భవనం, పరిసరాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రతలు తెలిపారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్ఐ నబీరసూల్‌ను ఆదేశించారు. సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులు పూర్తి చేస్తామని తెలిపారు. మట్కా, పేకాట, నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కణేకల్లు ఎస్ఐ నాగమధు, ఏఎస్ఐ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాదేవిపల్లిలో పర్యటించిన డీఎస్పీ

తాడిపత్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాదేవిపల్లిలో మంగళవారం డీఎస్పీ రామకృష్ణుడు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ గొడవలకు దిగకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మగానిపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో నందకిషోర్ తనిఖీ చేశారు. మంగళవారం సచివాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు ను పరిశీలించి విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మధ్యాహ్నం భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

పంట మార్పిడితోనే నల్ల తామర నివారణ

కూడేరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితోనే నల్ల తామర నివారణ సాధ్యమవుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు తెలిపారు. కూడేరు మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామ సమీపంలో సాగు చేసిన మిరపపంటను మంగళవారం ఆయనతోపాటు ఉరవకొండ ఉద్యాన శాఖ అధికారి నెట్టికంఠయ్య పరిశీలించారు. పంటకు ఆశిస్తున్న నల్ల తామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన పద్ధతుల గురించి రైతులకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో 30 నుంచి 40 వేల ఎకరాల్లో సాగు చేస్తున్న మిరప పూతలను నల్ల తామర ఆశించడంతో దెబ్బతింటోందన్నారు. వీటి నివారణకు పంట మార్పిడి, పచ్చిరొట్టె ఎరువులు, లోతైన దుక్కులతో సాధ్యమవుతుందన్నారు. పంట సాగు చేసే ముందు యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

బెళుగుప్ప, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుతత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. మండలంలోని కాల్వపల్లి, అంకంపల్లి, దుద్దేకుంట, తగ్గుపర్తి, రామసాగరం, బెళుగుప్ప, జీడిపల్లి తదితర గ్రామాల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ మధ్యంతర భృతి, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, 117 జీవో రద్దు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు ఇమామ్‌సాబ్, నాగరాజు, గంగాధరలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘం ఓటర్ల జాబితా విడుదల

గుమ్మఘట్ట , నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): బీటీ ప్రాజెక్టు సాగునీటి సంఘం ఎన్నికలపై రెవెన్యూ అధికారులు ఓటర్ల జాబితా విడుదల చేశారు. గుమ్మఘట్ట, గోనబావి, కలుగోడు, రంగచేడు, బేలోడు, భూపసముద్రం తదితర గ్రామాల్లో సాగునీటి వినియోగదారుల ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు ఆయా గ్రామ సచివాలయాల్లో ఆయకట్టు రైతుల సమక్షంలో విడుదల చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న దళితులు

కణేకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దళితుల అభివృద్ధికి రూ.18,497 కోట్లు భారీగా నిధులు కేటాయించడం పట్ల ఆ వర్గం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధికార ప్రతినిధి అంజిబాబు, నాయకులు యువరాజు, వన్నూర్‌స్వామి, కమ్మ రాజు, ప్రసాద్, రామలింగ పాల్గొన్నారు.